ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -42 పేజీలు - 8 వెల - 03/- గురువారం 28 మే 2026



మహానాడు ప్రారంభోపన్యాసంలో టిడిపి అధినేత చంద్రబాబు

# రాబోయే తరం కోసం పనిచేద్దాం



**సంస్కరణలకు,విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం నాంది**

**టిడిపి పుట్టుక, ప్రయాణం ప్రస్థానం అన్నీ అద్భుతాలే**

**పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసం**

**దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ టిడిపి**

**మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తాం**

**45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం**

**అమరావతి,మే 27 (రిపబ్లిక్ న్యూస్):**
విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం పార్టీ నాంది అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పుట్టుక, ప్రయాణం, ప్రస్థానం అన్ని అద్భుతాలేనని... ప్రతి అడుగు సంచలనమేనని పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. 1875 క్లస్టర్‌ల వేదికగా ఈసారి మహానాడు జరుగుతోందని సీఎం చంద్రబాబు తెలిపారు. లక్షలాదిమంది కార్యకర్తలు తొలిరోజే అదరగొట్టారని ప్రశంసించారు. పశ్చిమాసియా యుద్ధవాతావరణం మూలంగా మహానాడును వర్చువల్‌గా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 'సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు' అని 44 ఏళ్ల క్రితం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలనను టీడీపీ పరిచయం చేసిందని ప్రస్తావించారు. జెండర్ ఈ క్వాలిటీ, సామాజిక సమస్యలపై తెలుగుదేశం **మిగతా 2లో...**






# త్రిభాషా సూత్రం..
## కేంద్రం, ఎన్సీఈఆర్టీలకు సుప్రీంకోర్టు నోటీసులు



**జులై 1 నుంచి 9, 10వ తరగతి విద్యార్థులకు త్రిభాషా సూత్రం**

**త్రిభాషా సూత్రంపై సుప్రీంకోర్టులో పిటిషన్**

**రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని కేంద్రానికి నోటీసులు**

**న్యూఢిల్లీ,మే 27 (రిపబ్లిక్ న్యూస్):**
ఎన్‌సీఈఆర్టీలో త్రిభాషా సూత్రానికి సంబంధించి దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం, సీబీఎస్‌ఈ, ఎన్సీఈఆర్టీలకు నోటీసులు జారీ చేసింది. జులై 1వ తేదీ నుంచి 9, 10వ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలు అభ్యసించాలని సీబీఎస్‌ఈ ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. **మిగతా 2లో...**



# కేరళం మాజీ సీఎం పినరయ్ నివాసాలపై ఇడి దాడులు
## కొచ్చిన్ మినరల్స్ లిమిటెడ్ కేసు

**తిరువనంతపురం,మే 27 (రిపబ్లిక్ న్యూస్):**
కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులకు దిగింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కేసులో భాగంగా సోదాలు చేపట్టింది. మాజీ సీఎం నివాసంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. రూ.1.72 కోట్ల ఈ మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్**మిగతా 2లో...**

# ప్రధాని మోడీతో తమిళనాడు సిఎం విజయ్ భేటీ

**రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రధానికి సిఎం వినతి**

**పలు అంశాలపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**


2లో.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తాం

**టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహానాడులో తొలి ప్రసంగం చేసిన నారా లోకేశ్**

**చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి అని వ్యాఖ్య**

**అమరావతి,మే 27 (రిపబ్లిక్ న్యూస్):**
తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తన తొలి మహానాడు ప్రసంగం సందర్భంగా నారా లోకేశ్ కీలక ప్రకటన చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు మహానాడులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భారీ ప్రకటన చేయబోతున్నట్టు ముందుగానే ఆయన ఎక్స్ వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే.



# మోడీ 12 ఏళ్ల పాలనపై పెద్ద ఎత్తున ప్రచారం

**జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాలు**

**మోడీ నాయకత్వంలో ఆర్థికంగా బలపడ్డ భారత్**

**జగన్ జనంలో లేకపోవడమే పెద్ద శాపం**

**మీడియా సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్**



2లో.

# మమత, స్టాలిన్ ఓటమికి ఎస్ఐఆరే కారణం

**'ఎస్ఐఆర్'పై జగన్ సంచలన వ్యాఖ్యలు...**

**ఓట్ల తొలగింపుపై వైసీపీ శ్రేణులను హెచ్చరించిన జగన్**

**పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచన**

**అమరావతి,మే 27 (రిపబ్లిక్ న్యూస్):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో భారీ ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్ వంటి కీలక నేతలు సైతం తమ నియోజకవర్గాల్లో ఓటమి పాలయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. ఇదే తరహా ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. **మిగతా 2లో...**



# తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం

**మహారాష్ట్ర సీఎంకురేవంత్ రెడ్డి లేఖ**

**చర్చల కోసం సమయమివ్వాలని లేఖలో విజ్ఞప్తి**

**ఎఫ్ఆర్ఎల్ పెరిగినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువ ఉంటుందని వెల్లడి**

**న్యూఢిల్లీ,మే 27 (రిపబ్లిక్ న్యూస్):**
మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో పేర్కొన్నారు. చర్చల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులకు సమయం ఇవ్వాలని, సమావేశానికి తేదీని ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు **మిగతా 2లో...**



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888



# త్రిభాషా సూత్రం..

## కేంద్రం, ఎన్సీఈఆర్టీలకు సుప్రీంకోర్టు నోటీసులు

**మొదటిపేజీ తరువాయి**

ఈ క్రమంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీలతో కూడిన ధర్మాసనం ఈ నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. భాష అనేది ఛాయిస్ అని, దీనిని బలవంతంగా రుద్దలేమని కపిల్ సిబాల్ అన్నారు. ఈ వ్యవహారంలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణను జులై రెండోవారానికి వాయిదా వేసింది.

త్రిభాషా విధానాన్ని అమలు చేయడానికి సీబీఎస్ఈ లాజిస్టికల్ సంసిద్ధతపై నివేదిక సమర్పించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటీని ఆదేశించింది. మరోవైపు, ఎనిమిదో తరగతి ఎన్సీఈఆర్టీ పుస్తకంలో న్యాయవ్యవస్థను కించపరిచేలా అంశాన్ని చేర్చడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2026-27 విద్యా సంవత్సరంలో 9, 10వ తరగతి విద్యార్థులు రెండు జాతీయ భాషలతో పాటు మొత్తం మూడు భాషలు తప్పనిసరిగా నేర్చుకోవాలని సీబీఎస్ఈ పేర్కొంది. విదేశీ భాషను చదవాలనుకునే విద్యార్థులు తృతీయ భాషగా దానిని ఎంపిక చేసుకోవచ్చని పేర్కొంది.

# కేరళం మాజీ సిఎం పినరయ్ నివాసాలపై ఇడి దాడులు

**మొదటిపేజీ తరువాయి**

లిమిటెడ్ అనే ప్రైవేట్ కంపెనీ 2018-2019 మధ్యకాలంలో మాజీ సీఎం విజయన్ కుమార్తె టి.వీణకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి ఎలాంటి సేవలు అందించలేదు. అయినప్పటికీ సీఎమ్ఆర్ఎల్ కంపెనీకి రూ.1.72 కోట్లు అక్రమంగా చెల్లించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, 2024లో ఈ ఆరోపణలపై విచారణ జరిపేందుకు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ కేసు దాఖలు చేసింది. ఈ కేసులో ఈడీ విచారణను రద్దు చేయాలని కోరుతూ సీఎంఆర్ఎల్ సంస్థ కేరళం హైకోర్టును ఆశ్రయించింది. మంగళవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కోర్టు తీర్పునిచ్చిన మరుసటి రోజే ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. తిరువనంతపురంలోని విజయన్ అద్దె ఇంటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 10 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున ఈడీ అధికారులు తిరువనంతపురం

లోని పినరయి విజయన్ అద్దె నివాసం, కన్నూర్‌లోని ఆయన కుటుంబ నివాసం, కోజికోడ్‌లోని మాజీ పర్యాటక శాఖ మంత్రి పి.ఎ. మహమ్మద్ రియాస్ నివాసంతో సహా పలుచోట్ల ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో పెద్ద సంఖ్యలో అధికారులతో, కట్టుదిట్టమైన గోప్యత మధ్య ఈ సోదాలు మొదలయ్యాయి.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

చెప్పినట్టుగానే ఆయన భారీ ప్రకటన చేశారు. మహిళలు, యువతకు పార్టీలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నూతన హోదాలో తొలిసారి మహానాడు ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించిన లోకేశ్... మహిళా సాధికారతపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. "పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పాసైనా, అవ్వకపోయినా... రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ తరపున మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తాం" అని లోకేశ్ సంచలన ప్రకటన చేశారు. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని నమ్మిన పార్టీ టీడీపీ అని, అందుకు కట్టుబడి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నారా లోకేశ్ చేసిన ఈ భారీ అధికారిక ప్రకటనతో మహానాడు సభ ప్రాంగణంలో ఒక్కసారిగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అంతకుముందు నుంచే లోకేశ్ చేయబోయే ప్రకటనపై రాజకీయ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠకు ఈ నిర్ణయంతో తెరపడింది. పార్టీలో యువతకు, మహిళలకు పెద్దపీట వేయడం ద్వారా రాబోయే కాలంలో సరికొత్త నాయకత్వాన్ని తయారుచేస్తామని లోకేశ్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు.

## తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం

**మొదటిపేజీ తరువాయి**

మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగీకరించిందని గుర్తు చేశారు. కానీ దీంతో ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితేనే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లు వస్తాయని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని పేర్కొన్నారు.

**కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి భేటీ**

కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ గా భేటీ అయ్యారు. అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది.

అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం అమలుకు సంబంధిత ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వేగవంతం తదితర అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ రింగ్ నెట్ వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసేందుకు స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై వారు చర్చించారు. తెలంగాణ విజ్ఞప్తులపై సింధియా సానుకూలంగా స్పందించారు. కేంద్రం సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

## ప్రధాని మోడీతో తమిళనాడు సిఎం విజయ్ భేటీ



**న్యూఢిల్లీ,మే 27 (రిపబ్లిక్ న్యూస్):** తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసు కున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రధాని మోదీతో భేటీలో పలు అంశాలు చర్చించారని సమాచారం. తొలుత దిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం అయ్యాక ఆయన తొలిసారి ప్రధానితో సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో.. తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తమిళనాడుకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయంతో పాటు పలు అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు నేతలు కలిసిన సందర్భంగా తీసిన ఫొటోలను పీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారత్‌కు రప్పించడంలో ప్రధాని మోదీ చేసిన కృషికి సీఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మేకెదాటు డ్యామ్ వివాదం అంశంపైనా ప్రధానితో చర్చించినట్లు పేర్కొంది. తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై సీఎం ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరాల్సిందిగా అభ్యర్థించినట్లు పేర్కొంది. అనంతరం ఆయన నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జన్‌పథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్-విజయ్ పోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.

# మమత, స్టాలిన్ ఓటమికి ఎస్ఐఆరే కారణం

**మొదటిపేజీ తరువాయి**

తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఓట్ల తొలగింపుపై అనేక రాజకీయ పార్టీలు అనుమానాలు వ్యక్తం చేశాయని జగన్ గుర్తుచేశారు. పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షల ఓట్లు, తమిళనాడులో 94 లక్షల ఓట్లు తొలగించారని ఆయన గణాంకాలతో సహా వివరించారు. పశ్చిమ బెంగాల్‌లోని భబానీపూర్ నియోజకవర్గంలో 45,982 ఓట్లను తొలగించారని, అక్కడ మమతా బెనర్జీ 15,000 ఓట్ల తేడాతో ఓడిపోయారని తెలిపారు. అదేవిధంగా, తమిళనాడులోని కొళత్తూరు నియోజకవర్గంలో 71,000 ఓట్లను తొలగించగా, స్టాలిన్ 8,000 ఓట్లతో ఓటమి చవిచూశారని జగన్ విశ్లేషించారు. ప్రతి గ్రామంలో కొద్ది సంఖ్యలో నిజమైన ఓట్లను తొలగించినా, అది నియోజకవర్గ స్థాయి ఫలితాలను గణనీయంగా ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి సంబంధించిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్లపై నిశితంగా దృష్టి సారించాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపుతూ, అక్కడ ఓటర్ల జాబితాలో ఒకే పేరు, ఒకే కుటుంబ వివరాలతో వేలాది అనుమానాస్పద ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు**

ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత జగన్ పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసే క్రమంలో నియోజకవర్గ ఇంఛార్జిలకు ఆయన తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఏ నియోజకవర్గంలోనైనా, ఏ ఒక్క స్థానంలోనైనా ఎన్నిక ఏకగ్రీవమైతే, దానిని పూర్తిగా ఆ ఇంఛార్జి వైఫల్యంగానే పరిగణిస్తానని తేల్చిచెప్పారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, సమన్వయకర్తలు, ఇంఛార్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార పార్టీ కుట్రలను ఎదుర్కొని ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. "ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలి. ఎక్కడైనా ఏకగ్రీవం జరిగిందంటే మాత్రం నేను చాలా సీరియస్‌గా తీసుకుంటా. ఇది మళ్లీ మళ్లీ చెబుతున్నా. అలా జరిగితే అది నియోజకవర్గ ఇంఛార్జి ఫెయిల్యూర్‌గానే భావిస్తా" అని జగన్ స్పష్టం చేశారు.

అభ్యర్థుల ఎంపిక, వారికి ఇవ్వాల్సిన భరోసాపై కూడా జగన్ దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఎస్సీలు బలంగా ఉన్న గ్రామాల్లో వారి నుంచే అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ, ఇంఛార్జి అండగా ఉన్నారనే ధైర్యాన్ని కల్పించాలని, అలా చేస్తేనే అసెంబ్లీ ఎన్నికల్లో వారు మనకు అండగా నిలుస్తారని వివరించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తించి, ఎన్నికల బరిలోకి దింపాలని ఆదేశించారు. చంద్రబాబు ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ నేతలకు సూచించారు. ఇందుకోసం 'వెన్నుపోటు రెండేళ్లు' పేరుతో రూపొందించిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లోపాలపై ఇంటింటా చర్చ జరిగేలా చేయడం ద్వారా ప్రజలే ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని నేతలకు స్పష్టం చేశారు.

# రాబోయే తరం కోసం పనిచేద్దాం

**మొదటిపేజీ తరువాయి**

పోరాడిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జాతీయ జెండా దేశానికి గౌరవం.. పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసమని చంద్రబాబు అన్నారు. రెండ్రోజుల పాటు జరిగే మహానాడు ప్రారంభం సందర్భంగా ఆయనమాట్లాడారు. సంస్కరణలకు, విజన్ పాలిటిక్స్‌కు నాంది తెలుగుదేశమని తెలిపారు. దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ తెదేపా అని కొనియాడారు. జాతీయ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన ఏకైక ప్రాంతీయ పార్టీ మనదని గుర్తుచేశారు. మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తామని ధీమా వ్యక్తంచేశారు. కూడు, గూడు నీడ లాంటి సంక్షేమ విధానాలతో తెదేపా ఆవిర్భవించిందని గుర్తు చేశారు. 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం చేస్తూనే ఉందన్నారు. దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా ప్రజా పోరాటాలు ఆపలేదని గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం. మహిళల వంటింటి కష్టాలు తగ్గేందుకు నాడు గ్యాస్ కనెక్షన్ ఉచితంగా ఇచ్చాం. నేడు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఆడబిడ్డలకు ఆర్థిక, సామాజిక గౌరవమిస్తున్నాం. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పించాం. తల్లికి వందనం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నాం. మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని నిరూపించాం. గంజాయి, డ్రగ్స్‌పై అత్యంత కఠినంగా ఉన్నాం. సోషల్ సైకోల తాటతీసి. మహిళల గౌరవాన్ని కాపాడుతాం. నాడు ఒక్క ఐటీనే.. యువత తల రాత మార్చింది. తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు పెరిగాయి. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్లు వంటివన్నీ రాష్ట్రానికి వస్తున్నాయి. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని చెప్పాం. ఎంవోయూలన్నీ పూర్తయితే ఇది సాధ్యమే. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడాం. ఇప్పుడు గేర్ మార్చాం.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడుతున్నాం. ఏ ప్రాజెక్టు వచ్చినా మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తున్నాం. 288 ప్రాజెక్టులు ప్రారంభించే రోజు కూడా నిర్ణయించేశాం అని సీఎం తెలిపారు. వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హోరు తగ్గిందేమో కానీ... కార్యకర్తల్లో జోరు మాత్రం తగ్గలేదని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహిస్తున్నామని తెలిపారు. యుద్ధం వల్ల మహానాడును హైబ్రీడ్ పద్ధతిలో నిర్వహిస్తున్నామని వివరించారు. మీటింగ్ మోడల్ మారిందే తప్ప.. మహానాడు విధానం మారలేదని అన్నారు. భవిష్యత్తు గురించి అన్ని విషయాలు చర్చించుకుందామని తెలిపారు. కూడు, గూడు, నీడ లాంటి సంక్షేమ విధానాలతో టీడీపీ ఆవిర్భవించిందని ప్రస్తావించారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారి గౌరవం, ఆత్మవిశ్వాసమని ఉద్ఘాటించారు. ప్రతీ ఒక్కరికీ తెలుగుదేశం జెండా చూస్తేనే నమ్మకం, భరోసా కలుగుతోందని తెలిపారు. నాటికి, నేటికి టీడీపీపై ప్రజలకు ఆదరణ చెక్కు చెదరలేదని చెప్పారు. 45 ఏళ్లుగా ప్రజాసమస్యల కోసం టీడీపీ నిరంతర పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రజా పోరాటాలు ఆపలేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'వైసీపీ హయాంలో నరహంతకులు పీకలు కోస్తున్నా.. టీడీపీ కార్యకర్తలు తెలుగుదేశం జెండాను వీడలేదు. చంద్రయ్య లాంటి కార్యకర్తను నరుకుతున్నా.. జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారు. ఆయన స్ఫూర్తి కలకాలం నిలుస్తోంది. అక్రమంగా నన్ను జైల్లో పెట్టారు, లోకేశ్ యువగళాన్ని అడ్డుకున్నారు. మన నేతలను అరెస్టు చేశారు. బాధితులనే నిందితులుగా చేశారు. అయినా టీడీపీ వెనకడుగు వేయలేదు. ప్రజాస్వామ్యం కోసం టీడీపీ నిలిచిందని అంటూ వివరించారు. ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పనిచేస్తున్నాం. ప్రజలు ఆదరించి, ఆశీర్వదించి రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత అప్పగించారు. పాలనలో అగ్రెసివ్‌గా, ప్రోగ్రెసివ్‌గా ముందుకు వెళు తున్నాం. మహిళా సాధికారిత, సామాజిక, ఆర్థిక రాజకీయ గౌరవం కోసం టీడీపీ పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి.. నేడు తల్లికి వందనం వరకూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించటంతో పాటు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ టీడీపీ వారి వెనుక ఉంటుంది. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చాం. ఇది చూసే నా చిన్నప్పుడు ఇష్టంగా నడిపిన రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా రాష్ట్రానికి వచ్చింది. 1875 ప్రాంతాల్లో మహానాడు హైబ్రిడ్ సమావేశం జరుగుతోంది. ఏ తీర్మానానికి ఎంతమంది ఆమోదం తెలిపారో రియల్ టైంలో వస్తున్నాయి. బెస్ట్ టెక్నాలజీ ప్లస్‌ని ఇక్కడికి తెస్తామని యువతకు విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## మోడీ 12 ఏళ్ల పాలనపై పెద్ద ఎత్తున ప్రచారం

**జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాలు**

**మీడియా సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్**

**విజయవాడ,మే 27 (రిపబ్లిక్ న్యూస్):**

ప్రధాని నరేంద్ర మోదీ దేశ పగ్గాలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా బలపడిందని, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. పేదరిక నిర్మూలన, ఉచిత బియ్యం పంపిణీ, భీమా పథకాలు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగిందన్నారు.

జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాల ద్వారా మోదీ పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. జూన్ 8 నుంచి 14 వరకు కేంద్ర నిధులతో నిర్మాణం అవుతున్న ప్రాజెక్టులను సందర్శిస్తామని, జూన్ 12 నుంచి 14 వరకు మీడియా సమావేశాల ద్వారా మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలు, సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ హైవేలు, గ్రీన్ కారిడార్లు, రైల్వే అభివృద్ధి పనుల వల్ల ఉద్యోగ అవకాశాలు పెరిగాయని మంత్రి పేర్కొన్నారు. దేశ జీడీపీ గణనీయంగా పెరిగిందని, భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి చేరుకుందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు, ప్రధాని మోదీకి గౌరవం పెరిగిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇకపోతే జనంలో లేకపోవడమే జగన్‌కున్న అసలు సమస్య అని, ఏపీ వ్యాప్తంగా నిరసనలకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపునివ్వడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసలు జగన్ ఈ నిరసనలు ఎందుకు చేస్తున్నారో ఆయనకైనా స్పష్టత ఉందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎలాంటి హామీలనూ అమలు చేయలేదని జగన్ విమర్శిస్తున్నారని, అలా మాట్లాడే ముందు ఆయన క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలుసుకోవాలని హితవుపలికారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన సత్యకుమార్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ప్రతి నెలా ఒకటో తారీఖునే లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు ఇస్తున్నామని, ఇందుకోసం నెలకు దాదాపు 33 వేల కోట్ల రూపాయలను నేరుగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే 'అన్నదాత సుఖీభవ' కింద కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ నిధులతో కలిపి రాష్ట్రంలోని రైతులకు నిబంధనల ప్రకారం రూ.20,000లను వారి అకౌంట్లలో జమ చేయడం జరిగిందన్నారు. దీంతో పాటూ 'తల్లికి వందనం' కార్యక్రమం ద్వారా ఏడాదికి పదివేల కోట్ల రూపాయలు లబ్దిదారుల ఖాతాల్లోకి వెళ్తున్నాయని వివరించారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు పథకం ద్వారా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరూ రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ప్రయాణాలు సాగిస్తున్నారని గుర్తుచేశారు. గతంలో కూడా జగన్ ఒక కోటరీని ఏర్పాటు చేసుకొని, కేవలం వాళ్లు చెప్పిన విషయాలనే వింటూ 'క్లౌడ్ నైన్' లో తిరిగేవారని.. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉన్నట్టు తనకు అనిపిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. 'పచ్చకామెర్లవాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది' అన్న చందంగా జగన్ వైఖరి ఉందన్న సత్యకుమార్.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినప్పుడు ఎటువంటి అరాచకాలు జరిగాయో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు.

## కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు తప్పవు

**తప్పదోవ పట్టించేలా ఎపి పేపర్ మిల్లు సమాచారం**

**పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**



**రాజమండ్రి,మే 27 (రిపబ్లిక్ న్యూస్)::** గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గోదావరి నదిలో కాలుష్యాన్ని నివారించేందుకు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. పరిశ్రమలు ఇక్కడి వనరులను ఉపయోగించుకుని లాభాలు పొందుతున్నాయని, కానీ కాలుష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ఏపీ పేపర్ మిల్ యాజమాన్యం తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించిందని మంత్రి తెలిపారు. పరిశ్రమ నుంచి విడుదలైన రసాయనాల్లో పీహెచ్ స్థాయి 7 శాతం నమోదైనట్లు చెప్పారు. కలుషిత వ్యర్థాలను గోదావరిలో కలుపుతున్నారని, పరిశ్రమ యాజమాన్యం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పరిశ్రమల నుంచి మురుగునీరు నేరుగా బయటకు వస్తే యజమానులను జైలుకు పంపిస్తామని, గోదావరిలో వ్యర్థాలు కలిపితే ఆ పరిశ్రమలకు తాళాలు వేస్తామని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల కోసం రూ.8,500 కోట్ల బ్జడెట్‌తో ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు. యాత్రికుల కోసం టెంట్ సిటీలు, హోం స్టేలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలోనే నంది నాటకోత్సవాలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏపీ పేపర్ మిల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఆ సంస్థకు రూ.13 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

# పారిశుద్ధ్య కార్మికుడిపై కత్తితో దాడి

**గంజాయి మాఫియా కారణమంటూ సిఐటియు ఆగ్రహం**

**నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్**





**అనంతపురం/ కళ్యాణదుర్గం క్రైమ్, మే 27,(రిపబ్లిక్ న్యూస్):** కళ్యాణదుర్గం పట్టణంలో పారిశుద్ధ్య కార్మికుడిపై జరిగిన కత్తిదాడి ఘటన కలకలం రేపింది. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు ఏ. వెంకటేష్ (40)పై యువకుడు విచక్షణారహితంగా కత్తితో దాడి చేయడంతో ఆయన తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయపడిన వ్యక్తిని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతోప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.కళ్యాణదుర్గం పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీలో మంగళవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా క్రికెట్ ఆడుతున్న బాలుర మధ్య జరిగిన చిన్నపాటి వాగ్వాదం ఉద్రిక్తతకు దారితీసింది. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లిన వెంకటేష్ కుటుంబ సభ్యుల సమక్షంలోనే పవన్ కుమార్ అనే వ్యక్తి కత్తితో దాడి చేయడం జరిగింది. ఈ దాడిలో వెంకటేష్ తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో కుప్పకూలిపోయారు.స్థానికులు వెంటనే ఆయనను కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించినప్పటికీ ఆరోగ్య పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉందని కుటుంబ సభ్యులకు తెలిపారు.బాధితుడిని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్రకుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజ్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

### హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణదుర్గం పట్టణంలో మద్యం, గంజాయి మాఫియా ప్రభావం పెరగడం వల్ల ఇటువంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అమాయక పారిశుధ్య కార్మికుడిపై కత్తితో దాడి చేయడం అత్యంత దారుణమని ఖండించారు. నిందితుడి పై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి పవన్ కుమార్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలో బెల్ట్ షాపులు, అక్రమ మద్యం విక్రయాలు, గంజాయి మాఫియాపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వన్నూరు స్వామి, ఏ.లక్క, ఏ.బాబు, డి.ప్రసాద్, హెచ్. అజినేయులు తదితరులు పాల్గొన్నారు.

# పాములపాడు మండలంలో అట్టహాసంగా ప్రారంభమైన వర్చువల్ మహానాడు

**అన్న ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు టీడీపీ నాయకులు**

**పసుపు సైనికులతో కలసి వర్చువల్ మహానాడులో పాల్గొన్న మండల నాయకులు**



**పాములపాడు మే-27 రిపబ్లిక్ న్యూస్:-** తెలుగుదేశం పార్టీ పసుపు సైనికుల ప్రధాన పండుగ పసుపు పండుగ మహానాడు కార్యక్రమాన్ని ఈ ఏడాది ఇందన పొదుపులో భాగంగా వర్చువల్ విధానంలో అది కూడా మండలంలోని, పాములపాడు క్లస్టర్ లో ఇన్చార్జి బండ్లమూరి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, వేంపెంట గ్రామ మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ, సొసైటీ చైర్మన్ సి.గోవిందు, టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం మోహన్ గౌడ్, టిడిపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లింగాల నాగరాజు, మిట్టకందాల గ్రామ మాజీ సర్పంచ్ జి.హరిప్రసాద్ యాదవ్, మద్దూరు తిమ్మారెడ్డి, సొసైటీ చైర్మన్ వాడాల జనార్ధన్ రెడ్డి, ఎర్రగూడూరు క్లస్టర్ లో ఇన్చార్జి చెల్లె హరినాధ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీం భాష, నియోజవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచపూడి సురేష్, జూటూరు హఫీజ్, తదితర నాయకుల ఆధ్వర్యంలో వర్చువల్ మహానాడులో నాయకులతో కలసి పాల్గొని, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు అన్న నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేసి వర్చువల్ గా జరుగుతున్న మహానాడులో జాతీయ నాయకుల ప్రసంగాలను వినడం జరిగింది. వక్తలు నందమూరి తారక రామారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్కు చేసిన సేవలు గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ (డిసి) ఆల్ఫ్రెడ్, మాజీ ఎంపిటిసి శివకుమార్, బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, నాయకులు వేమారెడ్డి, చిన్నస్వామి ఆచారి, సుబ్బారావు, గోకారి, రామచంద్రుడు, మొగిలి శ్రీను, తాటిపాటి నాయుడు, హుస్సేన్, వేంపెంట సొసైటీ చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, లింగాల మాజీ సర్పంచ్ మల్లేశ్వర్ రెడ్డి, తుమ్మలూరు వెంకటేశ్వర్ రెడ్డి, నాగేశ్వరరావు, ఆదిరెడ్డి, భావన రాము, తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# రమాబాయి ఆత్మస్థైర్యం మహిళలకు ఆదర్శం

**మాతా రమాబాయి అంబేద్కర్ 91వ వర్ధంతి సందర్భంగా మహిళా ఐక్య వేదిక నివాళులు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 27)** రమాబాయి అంబేద్కర్ ఆత్మస్థైర్యం మహిళలందరికీ ఆదర్శప్రాయమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. కర్నూలులోని మహిళా ఐక్య వేదిక ప్రధాన కార్యాలయంలో మాతా రమాబాయి అంబేద్కర్ 91వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి కలిసి రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నంది విజయలక్ష్మి మాట్లాడుతూ, రమాబాయి అంబేద్కర్ తన త్యాగాల పునాదుల మీదే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను మహోన్నత వ్యక్తిగా నిలబెట్టారని పేర్కొన్నారు. అంబేద్కర్ జీవితంలోని ప్రతి విజయానికి వెనుక రమాబాయి అనుభవించిన కష్టాలు, త్యాగాలు ఉన్నాయని తెలిపారు.అంబేద్కర్ ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లిన సమయంలో కుటుంబ బాధ్యతలను రమాబాయి ఒంటరిగా నిర్వహించారని, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ కూడా అంబేద్కర్‌కు ధైర్యం చెప్పి ముందుకు నడిపించారని గుర్తు చేశారు. పిల్లలు అనారోగ్యంతో బాధపడిన సందర్భాల్లో కూడా ఆమె అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారని కొనియాడారు.బహుజన సమాజ అభ్యున్నతికి అంబేద్కర్ ఎంత కృషి చేశారో, అదే స్థాయిలో రమాబాయి కూడా ఆయన వెనుక నిలబడి సేవలందించారని తెలిపారు. మాతా రమాబాయి త్యాగాల ప్రతిరూపమే బాబాసాహెబ్ అంబేద్కర్ అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల లక్ష్మి, ఎర్రం లక్ష్మిదేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్ చారిత్రాత్మకం

**మహానాడులో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ హర్షం -స్త్రీశక్తికి టీడీపీ పెద్దపీట : చంద్రబాబు, లోకేష్‌కు కృతజ్ఞతలు**



**అనంతపురం ప్రతినిధి, మే 27,(రిపబ్లిక్ న్యూస్):** తెలుగుదేశం పార్టీ మహిళా సాధికారత దిశగా మరో చారిత్రాత్మక అడుగు వేసిందని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. విజయవాడ నగరంలోని మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభమైన మహానాడు తొలి రోజు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మహానాడు పేరుతో ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం పార్టీ చరిత్రలోనే మహిళా శక్తికి ఇచ్చిన గొప్ప గౌరవంగా నిలిచిందన్నారు.ఈ సందర్భంగా నారా లోకేష్ ప్రకటించిన పార్టీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ నిర్ణయం మహిళల రాజకీయ భవిష్యత్తుకు బలమైన భరోసా కల్పించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పించేందుకు టీడీపీ కట్టుబడి ఉందని ఈ నిర్ణయం స్పష్టంచేస్తోందన్నారు. మహిళలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యం ఇవ్వడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందని గుర్తుచేశారు. మహానాడుకు రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా మహిళా కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారని, కార్యక్రమ ప్రాంగణం మొత్తం మహిళా శక్తితో కళకళలాడిందని తెలిపారు. మహిళల అభివృద్ధి, భద్రత, ఆర్థిక స్వావలంబన, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై చర్చలు జరగడం ఎంతో స్ఫూర్తిదాయకంగా అనిపించిందన్నారు.టీడీపీ ప్రభుత్వం గతంలో మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేసిందని, ఇప్పుడు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా మరోసారి మహిళల పక్షపాత పార్టీగా నిలిచిందన్నారు. మహిళలు రాజకీయాల్లో మరింత చురుకుగా ముందుకు రావడానికి ఈ నిర్ణయం ప్రేరణగా నిలుస్తుందని చెప్పారు.“ స్త్రీశక్తి “ కి పెద్దపీట వేస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేలా నిర్ణయాలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌లకు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళల పాత్రను గుర్తిస్తూ వారికి నాయకత్వ అవకాశాలు కల్పించడం ద్వారా సమాజాభివృద్ధికి బాటలు వేస్తున్నారని కొనియాడారు.

### మహిళల సాధికారత భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానాడులో పాల్గొని స్త్రీశక్తి తీర్మానాలకు తన మద్దతు తెలియజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మహిళల సాధికారత కోసం తెలుగుదేశం పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా రాజకీయ వేదికలను విస్తరించడం అభినందనీయమన్నారు.మహిళల భాగస్వామ్యం పెరిగితేనే సమాజం సమతుల్య అభివృద్ధి సాధిస్తుందని, ఆ దిశగా టీడీపీ తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త మార్పులకు నాంది పలుకుతాయని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అభిప్రాయపడ్డారు.

# కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లిన కుటుంబం ఇంట్లో చోరీ

**13 తులాల బంగారం, నగదు అపహరణ ఇద్దరు నిందితులు అరెస్ట్**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 27)** కర్నూలు పట్టణంలోని ఉద్యోగ్‌నగర్ ప్రాంతంలో జరిగిన ఇంటికన్నం దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఉద్యోగ్‌నగర్‌కు చెందిన తెలుగు చిన్న రంగడు కుటుంబ సమేతంగా కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లిన సమయంలో, ఈ నెల 21వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం బీరువాలో దాచిన సుమారు 13 తులాల బంగారు ఆభరణాలు మరియు కొంత నగదును అపహరించారు.బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 96/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన అబ్దుల్ మతిన్, పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామానికి చెందిన దేవరశెట్టి శివకృష్ణ ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు.పోలీసులు ప్రత్యేక బృందాల సహాయంతో నిందితులను మునగాలపాడు గ్రామ శివారులో అరెస్టు చేశారు. ప్రస్తుతం వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం అబ్దుల్ మతిన్‌పై మహబూబ్‌నగర్, జడ్చర్ల, హైదరాబాద్, సదాశివపేట పోలీస్ స్టేషన్లలో ఆరు పైగా కేసులు నమోదై ఉన్నాయి. అదేవిధంగా శివకృష్ణపై కూడా మూడు పైగా కేసులు ఉన్నట్లు వెల్లడించారు.అబ్దుల్ మతిన్ గతంలో హైదరాబాద్‌లోని ఐఐటీ సంగారెడ్డిలో ట్రాన్స్‌పోర్ట్ సూపర్వైజర్‌గా పనిచేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వ్యక్తిగత వివాదాలు, హత్యాయత్నం కేసు, పోక్సో కేసులో చిక్కుకుని ఉద్యోగం కోల్పోయాడని, చెడు అలవాట్లకు లోనై శివకృష్ణతో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు.దొంగిలించిన బంగారు ఆభరణాల స్వాధీనం ఇంకా జరగాల్సి ఉందని పోలీసులు తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో ఎస్ఐ గోపినాథ్, పీసీలు సుబ్బారాయుడు, మురళి కీలకంగా వ్యవహరించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# ప్రజా సమస్యలు పట్టించుకోని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు

**భారత కమ్యూనిస్టు పార్టీసిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం**

**ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ మునెప్ప**



**ఓర్వకల్లు ప్రతినిధి, మే 27 (రిపబ్లిక్ న్యూస్)** బుధవారం రోజున భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఓర్వకల్లు మండలంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల సహాయ కార్యదర్శి సుధాకర్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ మునెప్ప మాట్లాడుతూ ఓరకల్లు మండలం రోజురోజుకి అభివృద్ధిలో ముందు ఉంది అనేక పరిశ్రమలు అనేక పరిశ్రమలు వస్తున్నాయి అయితే ఈ పరిశ్రమల్లో భూములు కోల్పోయిన రైతులకు ఎలాంటి పునర్వాసం కల్పించలేదు ఎలాంటి ఉద్యోగం కూడా ఇవ్వలేదు స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు 75% ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం చొరవ చూపకుండా నిరుద్యోగ యువతకు ఇంతవరకు ఇలాంటి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించలేదు అదేవిధంగా స్కిల్ డెవలప్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఇంతవరకు ఏ ట్రైనింగ్ సెంటర్ ని కూడా ఏర్పాటు చేయలేదు మేము ఒక్కటే డిమాండ్ చేసేది ఎవరైతే భూములు కోల్పోయినారో వాళ్లకి పునర్వాసం కల్పించాలి. అదేవిధంగా స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి. వివిధ గ్రామాలలో భూములు కోల్పోయిన రైతులకు ఏదో రకంగా ఉపాధి కల్పించాలి అదేవిధంగా ఇల్లు లేని నిరుపేదలకు మూడు మూడు సెంట్ల స్థలాన్ని తక్షణమే మంజూరు చేయాలని అనేక డిమాండ్లతో ఈరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అదేవిధంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలు నొచ్చి ఓర్వకల్ మండలంలోని ఉప్పలపాడు కొంతలపాడు గుట్టపాడు గ్రామాల ప్రజలు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ మునెప్ప ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పుకొని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ లోపార్టీలో జాయిన్ కావడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రమేష్ ఏ ఐ టి యు సి ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు స్వామి రైతు సంఘం మండల అధ్యక్షులు మహబూబ్ బాషా ఏఐవైఎఫ్ నాయకులు వల్లి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మాజీ లీడర్ దస్తగిరి ఉప్పలపాడు సిపిఐ నాయకులు రాజు కొంతలపాడు సిపిఐ నాయకులు చంద్ర గుట్టపాడు నాయకులు మహేష్ సుంకన్న బాకరవల్లి చిన్న అయ్యస్వామి కృష్ణ నాగరాజు మధు అయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు

# స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రత్యేక సమగ్ర సవరణ

**ప్రతి పోలింగ్ కేంద్రానికి తప్పనిసరిగా బిఎల్ఏలను నియమించాలి**

**ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ**

**సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**






**నంద్యాల బ్యూరో, మే 27( రిపబ్లిక్ న్యూస్):** స్వచ్ఛమైన, ఖచ్చితమైన మరియు పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పన లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని సవరణ కార్యక్రమానికి సంబంధించిన ముఖ్యాంశాలను వివరించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రామునాయక్, ఈఆర్ఓలు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ఎ.ప్రదీప్, బిఎస్పీ పార్టీ ప్రతినిధి కె.శ్రీనివాసులు, బిజెపి పార్టీ ప్రతినిధి కె.చంద్రశేఖర్, సిపిఐ పార్టీ ప్రతినిధి పుల్లా నరసింహులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రియాజ్ బాషా, టిడిపి పార్టీ ప్రతినిధి పి. ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్ సిపి పార్టీ ప్రతినిధి సాయిరామ్ రెడ్డి, జనసేన పార్టీ ప్రతినిధి పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితా నాణ్యతను మరింత మెరుగుపరచడమే ప్రధాన ఉద్దేశమన్నారు. గతంలో 2002 సంవత్సరంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించగా, అనంతర కాలంలో నిరంతర ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, డూప్లికేట్ నమోదుల నిర్మూలన, ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాల బదిలీ, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన అర్హుల నమోదు వంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ – 2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 5 నుండి 14 వరకు సన్నాహక కార్యక్రమాలు, సిబ్బందికి శిక్షణ, గణన ఫారాల ముద్రణ చేపడతామన్నారు. అనంతరం జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి పాక్షికంగా ముందే వివరాలు నింపబడిన ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి తిరిగి సేకరిస్తారన్నారు. ఇదే సమయంలో పోలింగ్ కేంద్రాల సహేతుకీకరణ ప్రక్రియ కూడా కొనసాగుతుందని తెలిపారు. జూలై 21న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించబడుతుందని, జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు క్లెయిములు మరియు అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. అనంతరం సెప్టెంబర్ 18 వరకు విచారణలు, దావాలు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ కొనసాగి, అన్ని ప్రక్రియలు పూర్తైన తర్వాత సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేయబడుతుందని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి ఇంటికి వెళ్లే బిఎల్ఓలు ఓటర్లకు ముందుగా ముద్రితమైన ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారని, వాటిలో పేరు, ఎపిక్ నంబర్, చిరునామా, పోలింగ్ స్టేషన్ వివరాలు ఇప్పటికే ముద్రించి ఉంటాయని తెలిపారు. ఓటర్లు వాటిని పరిశీలించి అవసరమైన సవరణలు చేసి తిరిగి సమర్పించాలని సూచించారు. ఫారం సమర్పించని వారి పేర్లు ముసాయిదా జాబితాలో పొందుపరచబడకపోవచ్చని స్పష్టం చేశారు. ఇల్లు తాళం వేసి ఉన్న సందర్భాల్లో బిఎల్ఓలు కనీసం మూడు సార్లు సందర్శించి ఫారాల పంపిణీ, సేకరణ చేపడతారని చెప్పారు. కొత్తగా ఓటరు హక్కు పొందే వారు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఓటరు వివరాల్లో మార్పులు లేదా బదిలీల కోసం ఫారం–8, అభ్యంతరాలు లేదా తొలగింపుల కోసం ఫారం–7 వినియోగించవచ్చని వివరించారు. 17 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ముందుగానే దరఖాస్తు చేసుకుంటే, 18 సంవత్సరాలు నిండగానే ఓటు హక్కు ఆటోమేటిక్‌గా లభించే విధానం అమల్లో ఉందన్నారు. 2002 నాటి ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్ల ప్రస్తుత స్థితిపై మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, జిల్లాలో ఇప్పటివరకు సుమారు 69 శాతం మేర ఈ ప్రక్రియ పూర్తయిందన్నారు. బిఎల్ఓ యాప్‌లోని ఫీచర్ ద్వారా పాత ఓటరు వివరాలను ప్రస్తుత వివరాలతో అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. సెన్సస్ విధుల కారణంగా కొంత ఆలస్యం జరిగినప్పటికీ, త్వరితగతిన ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారంలో ఆధార్ నంబర్ నమోదు పూర్తిగా ఐచ్ఛికమని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆధార్ కేవలం గుర్తింపు రుజువుగా మాత్రమే పరిగణించబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆధార్ ఆధారంగా పుట్టిన తేదీ, చిరునామా లేదా పౌరసత్వాన్ని నిర్ధారించలేమన్నారు. అయితే ఎన్నికల చట్టాల ప్రకారం గుర్తింపు ధృవీకరణ కోసం ఆధార్ వినియోగించవచ్చని తెలిపారు. అలాగే ఫారంలో తండ్రి, తల్లి లేదా జీవిత భాగస్వామి పేరు, అందుబాటులో ఉంటే వారి ఎపిక్ నంబర్లు, మొబైల్ నంబర్ వంటి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఫారం సమర్పించిన తర్వాత బిఎల్ఓ సంతకం చేసిన ప్రతిని ఓటరుకు రశీదుగా అందజేస్తారని వివరించారు. ప్రత్యేక సమగ్ర సవరణ విజయవంతం కావాలంటే రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి తప్పనిసరిగా బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని కలెక్టర్ సూచించారు. బిఎల్ఓలు, బిఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తే మరింత ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించవచ్చని పేర్కొన్నారు.

# చిప్పగిరి లో వైభవంగా మహానాడు

**తెలుగుదేశం కార్యకర్తలే బలం, బలగం - వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్**





**చిప్పగిరి, మే, 27,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు బుధవారం మహానాడు కార్యక్రమం మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, క్లస్టర్ ప్రభాకర్, ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి, ఆర్గనైజేషన్ సెక్రటరీ వైకుంఠం ప్రసాద్, పరిశీలికుడు తలారి ఆదినారాయణ, పాల్గొన్నారు, ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, అనంతరం నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయము ను ప్రారంభించారు, నియోజకవర్గ ఇన్చార్జి వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగం, అని ఈ మహానాడు పండుగకు వచ్చిన ప్రతీ కార్యకర్తలకు కృతజ్ఞతల ని తెలిపారు, ఈ కార్యక్రమం చిప్పగిరి నందు విజయవంతంగా జరిగినందుకు కృతజ్ఞతలు అని



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లోకేష్ గారి పిలుపు మేరకే ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించామని, నందమూరి తారక రామారావు గారు పార్టీ బడుగు, బలహీన, వర్గాల మహిళాభివృద్ధి కోసమే తెలుగుదేశం పార్టీ స్థాపించారని పేదల కోసమే అహర్నిశలు కష్టపడ్డారని, తెలుగుజాతి ఆత్మగౌరవం కాపాడాలని, సమాజమే దేవాలయం ప్రజలే నా దేవుళ్ళని నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించడం జరిగిందని, నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా చంద్రబాబు నాయుడు నారా లోకేష్ ఆయన అడుగుజాడల్లో పార్టీని అంచలు అంచలుగా ముందుకు తీసుకెళ్తున్నా రని, మా ఆలూరు నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని, అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు, స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ కార్యదర్శి కొండ తులసి, చిప్పగిరి మాజీ సర్పంచ్ దాసరి గోవిందరాజులు, మాజీ కన్వీనర్ వైకుంఠం వెంకటేశ్వర్లు, బోగేస్ స్వామి ,జనార్ధన్ స్వామి, దేవక్క గారి జయన్న, బెల్డోనా కోనంకి శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి వెంకటేశ్వర్లు, కరివేముల గోవిందు, నేమక్కల్ మాజీ మండల కన్వీనర్ వలి, సన్నప్పయ్య, కాంట్రాక్టర్ సుంకన్న, సంఘాల భాస్కర్, చంద్ర, తిమ్మాపురం నాగిరెడ్డి, లక్ష్మన్న, నగర డోన రామదుర్గం సొసైటీ చైర్మన్ లక్ష్మీకాంత్, బోయ నాగార్జున, రామదుర్గం తిమ్మయ్య, రామచంద్ర, సోము నాయుడు, మాధవులు, బంటనహాళ్ సురేష్, దేగుల హాల్ మాజీ సర్పంచ్ నీలకంఠ, ఏరూరు హరి, కారం చంద్ర, నరసింహులు, జోరాపురం లక్ష్మీ ప్రసన్న, ఖాజీపురం ఓబయ్య, నంచర్ల శివలింగ, తిమ్మప్ప, గుమ్మనూరు అంపయ్య, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చదువే పిల్లల జీవితానికి నిజమైన ఆస్తి

**విద్యాశాఖ అధికారి సావిత్రమ్మ**







**చిప్పగిరి, మే, 27,( రిపబ్లిక్ న్యూస్)** చదువే పిల్లల జీవితానికి నిజమైన ఆస్తి అని విద్యాశాఖ అధికారి సావిత్రమ్మ తెలిపారు ,బుధవారం చైతన్య విద్యా రథం బడి పిలుస్తుంది కార్యక్రమం జరిగింది, ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తును బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య ఆధునిక సౌకర్యాలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల పై విస్తృత అవగాహన కల్పించారు, ప్రభుత్వ పాఠశాలలో విచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ లు ఇంగ్లీష్ మీడియం బోధన అనుభవాగ్నులై న ఉపాధ్యాయులు ఆహ్లాదకరమైన విద్య వాతావరణం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు, ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సురేంద్ర బాపూజీ, విద్యాశాఖ అధికారి 2 ఎస్ఎండి ఫరూక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామదుర్గం భీమ లింగప్ప, చిప్పగిరి మాజీ సర్పంచ్ గోవిందరాజులు, టీచర్లు, ఎంఆర్సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజారోగ్య సేవల్లో సేవాసంస్థల పాత్ర అభినందనీయం -శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**






**అనంతపురం / కదిరి సంక్షేమం, మే 27,(రిపబ్లిక్ న్యూస్ ):** పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కొప్పుల మీనాక్షమ్మ ఫౌండేషన్ అనంతపురం వారి సౌజన్యంతో విజన్ ప్లస్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కదిరి పట్టణంలోని నిజాంవలి కాలనీ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కొప్పుల మీనాక్షమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, శ్రీకాళహస్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ చెంచయ్య నాయుడు, కొప్పుల మీనాక్షమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రవికాంత్ రమణ తదితరులు పాల్గొన్నారు.

**వెనుకబడిన కుటుంబాలకు**

**వైద్య సేవలు అందించడం అభినందనీయం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నిపుణుల వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కొందరికి శస్త్రచికిత్స అవసరమైతే ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**ప్రజలకు అండగా నిలుస్తున్న**

**సేవాసంస్థలు సమాజానికి ఆదర్శం**

మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్న సేవాసంస్థలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. కొప్పుల మీనాక్షమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య సేవలు పొందారు. నిర్వాహకులు శిబిరానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

# కర్నూలు వైసీపీలో వర్గపోరు

**జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డిపై అహ్మద్ ఆలీఖాన్ తీవ్ర ఆరోపణలు**

**“మైనారిటీ నాయకులను ఎదగనివ్వడం లేదు.. ఇక మౌనం గా ఉండను” అంటూ హెచ్చరిక**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 27)**కర్నూలు రాజకీయాల్లో వైసీపీ అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. గత రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఆడియో సంభాషణలు జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారాయి. కర్నూలు సిటీ వైసీపీ అధ్యక్షుడు అహ్మద్ ఆలీఖాన్, ఐటిడీపీ జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ మధ్య జరిగినట్లు ప్రచారంలో ఉన్న సంభాషణల్లో, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ పరిణామాలతో కర్నూలు వైసీపీలో అంతర్గత కలహాలు మరోసారి బహిరంగ చర్చకు దారితీశాయి. పార్టీ ప్రత్యర్థుల కంటే సొంత పార్టీ నాయకుల నుంచే తనకు అవమానాలు ఎదురవుతున్నాయని అహ్మద్ ఆలీఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, సోషల్ మీడియాలో తనపై మరియు తన కుటుంబ సభ్యులపై అసభ్యకర పోస్టులు పెడుతూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.ఈ అంశంపై జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదని తెలిపారు. పార్టీ లోపలే తనను లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారం జరుగుతోందని మండిపడ్డారు. కర్నూలులో మైనారిటీ నాయకులు రాజకీయంగా ఎదగకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇందులో ఎస్వీ మోహన్ రెడ్డి పాత్ర ఉందని నేరుగా ఆరోపించారు.“ఇన్ని రోజులు పార్టీ కోసం ఎంతో అవమానాన్ని భరించాను. కానీ ఇకపై మౌనం పాటించను. నా రాజకీయ బలం ఏంటో రేపటి నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చూపిస్తా” అంటూ అహ్మద్ ఆలీఖాన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు కర్నూలు వైసీపీ రాజకీయాల్లో మరింత కలకలం రేపుతున్నాయి.ఇప్పటికే వైరల్ ఆడియోలు, సోషల్ మీడియా పోస్టులు, పరస్పర ఆరోపణలతో కర్నూలు వైసీపీలో వర్గపోరు బహిరంగరంగంలోకి వచ్చినట్లైంది. ఈ వ్యవహారంపై పార్టీ అధిష్ఠానం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# రాష్ట్ర అభివృద్ధే లక్ష్యం

## ప్రజలకు ప్రభుత్వ విజయాలు వివరించాలి -మహానాడులో మంత్రి టీజీ భరత్ పిలుపు

## కర్నూలుకు భారీ పెట్టుబడులు, హైకోర్టు బెంచ్‌తో అభివృద్ధి వేగం

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 27)**
రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి. భరత్ తెలిపారు. గత రెండేళ్లలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించడం పార్టీ నాయకులు, కార్యకర్తల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని మౌర్య ఇన్‌లో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ముందు దివంగత నేత నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మహానాడు సమావేశాన్ని నాయకులతో కలిసి వర్చువల్‌గా వీక్షించారు. కర్నూలు నగరంలోని 12 ప్రాంతాల్లో మహానాడు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై మహానాడులో చర్చిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ క్యాడర్‌పై



ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచక పరిస్థితులను ప్రజలు మరిచిపోలేదని విమర్శించారు. అధికారులు ఒకరే ఉన్నా నాయకత్వం మారడంతో రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమైందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. దేశంలోకి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని అన్నారు.
కర్నూలు జిల్లాలో వలసలను అరికట్టేందుకు పరిశ్రమల ఏర్పాటు దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి చెప్పారు. ఓర్వకల్లులో జైరాజ్ స్టీల్ కంపెనీకి గతంలో శంకుస్థాపన జరిగినప్పటికీ, అనుమతుల ఆలస్యంతో ఇబ్బందులు ఎదురయ్యాయని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంస్థ మరో రూ.6 వేల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చిందన్నారు. ఇప్పటికే ఓర్వకల్లుకు అగస్త్య, రిలయన్స్ వంటి సంస్థల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. సెమీకండక్టర్ రంగంలో కేంద్ర ప్రభుత్వం 2.0 పాలసీ తీసుకొస్తే రూ.23 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశముందని చెప్పారు. మంత్రి నారా లోకేష్ తో కలిసి ఈ పెట్టుబడులను తీసుకురావడంలో కృషి చేశామని తెలిపారు. ప్రభుత్వంపై చెడ్డపేరు తీసుకొచ్చేందుకు వైసీపీ విషప్రచారం చేస్తోందని మంత్రి ఆరోపించారు. లేనివాటిని ఉన్నట్లు చూపించడం ఆ పార్టీ నైజమని విమర్శించారు. తెలుగుదేశం పార్టీకి ఢిల్లీలో ప్రత్యేక గౌరవం ఉందని, టిడిపి నాయకుడినని చెప్పుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో మంచి పేరున్న నాయకులకే కార్పొరేటర్ టికెట్లు ఇస్తామని, సర్వేల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. కర్నూలు నగరంలో రోడ్ల విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇటీవల గాలివానలు, భారీ వర్షాల సమయంలో అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సి. క్యాంపు ప్రభుత్వ క్వార్టర్స్ ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కానుందని, దాంతో కర్నూలు నగర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.

# చిన్న బొంపల్లె చెరువుకు 20 ఏళ్ల తర్వాత నీటి కళ

## జలధార జలహారతి పనులతో చెరువులోకి వర్షపు ప్రవాహం

## -రిటెన్షన్ పిట్స్ ద్వారా 7.29 లక్షల లీటర్ల నీటి సంరక్షణ





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 27)**జిల్లాలో చేపట్టిన జలధార జలహారతి కార్యక్రమం ఫలితంగా కోసిగి మండలంలోని చిన్న బొంపల్లె చెరువుకు దాదాపు 20 ఏళ్ల తర్వాత మళ్లీ నీరు చేరడం ఆనందంగా ఉందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. చిన్న బొంపల్లె, పల్లెపాడు గ్రామాల్లో చేపట్టిన ఫీడర్ ఛానెల్ మరియు రిటెన్షన్ పిట్స్ పనులను ఆమె పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలతో పిట్స్ నిండిపోవడం, చెరువులోకి నీరు చేరడం కార్యక్రమ విజయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. చిన్న బొంపల్లె పెద్ద బొంపల్లె మధ్య ఉన్న చెరువుకు రెండు ఫీడర్ల పనులు పూర్తికావడంతో చిన్నపాటి వర్షాలకే నీటి ప్రవాహం చెరువులోకి చేరుతోందన్నారు. రాబోయే రోజుల్లో మరింత వర్షపాతం నమోదైతే చెరువు పూర్తిస్థాయిలో నిండే అవకాశముందని కలెక్టర్ పేర్కొన్నారు. దీని వల్ల పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీటి మట్టాలు మెరుగుపడటంతో పాటు రైతులకు సాగునీరు, పశువులకు తాగునీటి సమస్య తగ్గుతుందన్నారు. భూగర్భ జలాల పెంపుదల కోసం జిల్లాలో తొలిసారిగా అమలు చేస్తున్న నిలుపుదల గుంటలు విధానం మంచి ఫలితాలు ఇస్తోందన్నారు. చిన్న బొంపల్లె చెరువులో ఇప్పటివరకు 24 పిట్స్ పూర్తి చేయగా, మొత్తం 60 పిట్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి పిట్ సుమారు 1.2 క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో ఉండటంతో రెండు రోజుల వర్షాలకు సుమారు 56 వేల లీటర్ల నీటిని సంరక్షించగలిగామని చెప్పారు. అదేవిధంగా పల్లెపాడు గ్రామంలోని బలవన వాగులో 76 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి గుంత ద్వారా సుమారు 9,600 లీటర్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చేసి, మొత్తం 7,29,600 లీటర్ల నీటిని భూగర్భంలోకి పంపించామని వెల్లడించారు. వర్షపు నీరు వృథా కాకుండా నేరుగా భూమిలోకి చేరే ఈ విధానం భవిష్యత్తులో బోరు బావుల నీటి మట్టాలను గణనీయంగా పెంచుతుందని చెప్పారు. "ప్రకృతి ప్రసాదించిన ప్రతి నీటి బొట్టునూ సంరక్షించడమే లక్ష్యం" అని పేర్కొన్న కలెక్టర్, రాష్ట్రంలో ఎక్కడా అమలు కాని ఈ వినూత్న ప్రయోగాన్ని కర్నూలు జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, డ్వామా పీడీ నరసింహ రెడ్డి, ఇరిగేషన్ డీఈ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాలి

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను కచ్చితంగా నిర్వహించాలన్న కలెక్టర్ డా. ఏ.సిరి- ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 27)**
జిల్లాలో చేపడుతున్న ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలోని మాసూంబాషా దర్గా, బుధవారపేట ప్రాంతాల్లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి, 2002 ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని 2025 ఓటర్ల వివరాలను సరిపోల్చి ధృవీకరించాలని సూచించారు.
అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించే విధంగా ఓటర్ల జాబితా సిద్ధం కావాలని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదవుతున్న సందర్భాలను వెంటనే గుర్తించి సరిచేయాలని



అధికారులను ఆదేశించారు. కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. అనంతరం దామోదరం సంజీవయ్య స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలోని 142 నుంచి 147 వరకు పోలింగ్ కేంద్రాల పనితీరును పరిశీలించిన కలెక్టర్, బూత్ స్థాయి అధికారులు యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధానాన్ని సమీక్షించారు. ప్రజలతో మాట్లాడి, ఓటర్ల జాబితా తయారీలో అధికారులకు సహకరించాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని



పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నగర పరిశుభ్రతపై కూడా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. చెత్తను మురికి కాలువల్లో వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందించాలని, పరిశుభ్రమైన కర్నూలు నిర్మాణానికి ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.
కార్యక్రమంలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, అర్బన్ తహసీల్దార్ రవి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ్, ఎలక్షన్ సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారు లు పాల్గొన్నారు.

## మహానాడు తో తెలుగుదేశం పార్టీ లో నూతన ఉత్సాహం



**గుత్తి మే 27 రిపబ్లిక్ న్యూస్**
తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మహానాడు కార్యక్రమం గుత్తి పట్టణ మండల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ సూర్య ప్రతాప్ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి ఆధ్వర్యంలో వర్చువల్ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్



పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్నో సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి కష్టపడిన సీనియర్ నాయకులకు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకే డిజిటల్ పద్ధతిలో నిర్వహించామన్నారు. నందమూరి తారక రామారావు బడుగు బలహీన వర్గాల మహిళా అభివృద్ధి కోసమే తెలుగుదేశం పార్టీ స్థాపించారు. మహానాడు కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేసిన సోదరీ సోదరీమణులకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బద్రివలీ మండల అధ్యక్షుడు లక్ష్మీ రంగయ్య ప్రధాన కార్యదర్శి బత్తల మారుతి ప్రసాద్ పళ్ళ సాంబశివ యాదవ్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీనివాసులు రమేష్ రాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చౌదరి మాజీ కౌన్సిలర్ సుంకన్న రసూల్ కోనంకి కృష్ణ మాజీ సర్పంచ్ రామలింగమయ్య మాజీ సర్పంచ్ భరత్ రవిచంద్ర ఆయికట్టు చైర్మన్ శ్రీనివాసులు వేణు మహిళా అధ్యక్షురాలు సునీత శ్రీదేవి అరవింద్ రామాంజి రామ్మూర్తి రామాంజనేయులు రమేష్ నారప రెడ్డి హనుమన్న మధుసూదన్ రెడ్డి రామాంజనేయులు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహానాడు వేడుకలు

## వేడుకల్లో పాల్గొన్న జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, ఎంపీ అంబికా

## ప్రతి కార్యకర్త మహానాడులో పాల్గొనే అకాశం దక్కిందన్న ఎమ్మెల్యే -నారా లోకేష్ ఆధ్వర్యంలో సైనికుల్లా పని చేస్తాం : దగ్గుపాటి

## ప్రతి తెలుగువాడు గర్వించే విధంగా పార్టీ పని చేస్తుందన్న శ్రీనివాస్ రెడ్డి








**అనంతపురం సంక్షేమం, మే 27,(రిపబ్లిక్ న్యూస్):**
అర్బన్ నియోజకవర్గంలో పసుపు పండుగ సందడిగా సాగింది. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో 12క్లస్టర్ల పరిధిలో మహానాడు కార్యక్రమం తొలిరోజు ఘనంగా సాగింది. పార్టీ చరిత్రలో తొలిసారి హైబ్రీడ్ విధానంలో మహానాడు జరుగుతుండటంతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో 12క్లస్టర్ల పరిధిలో పండుగ వాతావరణం కనిపించింది. అర్బన్ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలో ఎమ్మెల్యే దగ్గుపాటి, జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అబ్జర్వర్ దేవేంద్రప్ప ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా పార్టీ కార్యాలయంలో జెండా వందనం చేసి ఎన్టీఆర్ కు ఘన నివాళలర్పించారు. ఆ తర్వాత మహానాడును ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం దగ్గుపాటి 2,3,4,5,6 క్లస్టర్ల పరిధిలో పరిశీలకులు దేవేంద్రప్పతో కలిసి పాల్గొన్నారు. అక్కడ నాయకులు, కార్యకర్తలను కలుస్తూ మహానాడులో సందడిగా కనిపించారు.

### నారా లోకేష్ నాయకత్వంలో సైనికుల్లా పని చేస్తాం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ గతంలో 43మహానాడులకంటే ప్రస్తుతం జరిగే 44వ మహానాడుకు ప్రత్యేకత ఉందన్నారు. నారా లోకేష్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో జరుగుతున్న ఈ కార్యక్రమం కోసం కార్యకర్తలంతా ఎదురు చూశారన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సూచనల మేరకు ఇంధన పొదుపులో భాగంగా వర్చువల్ ద్వారా నిర్వహించడం జరిగిందన్నారు. దీని ద్వారా ఇది ప్రజలకు కూడా ఒక సందేశం ఇచ్చినట్టైందన్నారు. గతంలో మహానాడు అంటే నియోజకవర్గం నుంచి కొంత మంది మాత్రమే వెళ్లే వారని.. కానీ నేడు వారి ఇంటి పరిసర ప్రాంతాల నుంచే మహానాడులో పాల్గొనే అవకాశం కల్గిందన్నారు. ఈ ఘనత అధినేత చంద్రబాబుకు మాత్రమే దక్కిందన్నారు. నారా లోకేష్ ఆధ్వర్యంలో రాబోయే మూడేళ్ల భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేశారన్నారు. తొలిరోజు ఆయన చేసిన ప్రసంగాన్ని రాష్ట్రమంతా ఆసక్తిగా వీక్షించిందన్నారు. కోటి సభ్యత్వాలు చేసి.. కార్యకర్తకు ఏదైనా ఇబ్బంది కల్గితే 5లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించిన నాయకులు నారా లోకేష్ అన్నారు. కార్యకర్తే నా అధినేత అనే నినాదంతో నారా లోకేష్ ముందుకెళ్తున్నారని.. ఆయన నాయకత్వంలో సైనికుల్లా పని చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు.

### ప్రతి తెలుగువాడు వీక్షించే పండుగ మహానాడు

జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి తెలుగువాడు వీక్షించే పండుగ మహానాడు అని అన్నారు. పొదుపు చర్యల్లో భాగంగా 1845క్లస్టర్ల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. దీని ద్వారా ప్రతి కార్యకర్త పాల్గొనే అవకాశం వచ్చిందన్నారు. రాష్ట్ర భవిష్యత్ నాయకుడు నారా లోకేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మహానాడు జరుగుతోందని.. స్త్రీ శక్తి, కార్యకర్తే అధినేత, యువత భవిష్యత్ అనే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చినట్టు చెప్పారు. రాబోయే మూడేళ్లకు సంబంధించిన రోడ్ మ్యాప్ తయారు చేసుకుంటామని.. ప్రతి తెలుగువాడు గర్వపడేలా, వారి సంక్షేమ, అభివృద్ధి కోసం టీడీపీ పని చేస్తుందని స్పష్టం చేశారు.

## డిజిటల్ మహానాడులో ప్రతి ఒక్క కార్యకర్త భాగస్వామ్యం అయ్యారు -ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూలు ప్రతినిధి, మే 27(రిపబ్లిక్ న్యూస్)**
డిజిటల్ మహానాడులో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలోని ప్రతి ఒక్క కార్యకర్త భాగస్వామ్యం అయ్యారని కర్నూలుఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు నగర 39 వ మున్సిపల్ వార్డులోని స్టాంటాన్ పురం లో గల ఏ టూ జెడ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కోడుమూరు నియోజకవర్గంలోని క్లస్టర్ 6 లోని 38,39,40 మున్సిపల్ వార్డుల



మహానాడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్న మహానాడు కార్యక్రమాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఎల్.ఈ.డి స్క్రీన్ ద్వారా తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఇందన పొదుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మహానాడును డిజిటల్ గా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు మహానాడు లో మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తూ శ్రీ శక్తి పై ప్రత్యేక తీర్మానం ప్రవేశపెట్టడం అభినందనీయమన్న ఆయన, నాడు దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి రామారావు మహిళలకు ఆస్థిలో సమాన హక్కు కల్పించి గౌరవిస్తే, నేడు చంద్రబాబు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారన్నారు.. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం చేయాలని కోరుతూ మహానాడులో ప్రవేశపెట్టిన తీర్మానానికి తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్న ఎంపీ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కర్నూలు లో హై కోర్టు బెంచ్ ఏర్పాటు పై తీర్మానం చేయడం పై ముఖ్యమంత్రి చంద్రబాబు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 38,39,40 వార్డుల క్లస్టర్ ఇంచార్జి నాగ మధు, కో క్లస్టర్ వరప్రసాద్, మూడు వార్డుల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.2023/87888



# ఉపాధి హామీ పనులు నిలిపివేతపై కార్మికుల్లో ఆందోళన

### ఫేస్ రికగ్నేషన్ యాప్ సాంకేతిక లోపమా..? లేక అధికారుల నిర్లక్ష్యమా ..?

### కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామంటున్న కార్మిక సంఘాలు

**బండి ఆత్మకూరు, మే 27, (రిపబ్లిక్ న్యూస్):-** బండి ఆత్మకూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు వరుసగా రెండో రోజు నిలిచిపోవడం ఉపాధి కూలీల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. బుధవారం నిర్వహించాల్సిన ఉపాధి హామీ పనుల్లో ఫేస్ రికగ్నేషన్ యాప్ పనిచేయకపోవడంతో కూలీలు పనులకు వెళ్లినా హాజరు నమోదు కాక ఇళ్లకే పరిమితమయ్యారు.అయితే గురువారం కూడా పనులు ఉండవని గ్రామాల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు సమాచారం ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోందనీ కార్మిక సంఘం నాయకులు డేవిడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులు ఎందుకు నిలిపివేస్తున్నారనే విషయంలో అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడం కార్మికుల్లో అసంతృప్తిని పెంచుతోందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తడం పేద కార్మిక కుటుంబాలకు ఇబ్బందికరంగా మారిందని కార్మిక సంఘం నాయకులతోపాటు ఉపాధి కూలీలు ఆవేదన చెందుతున్నారు.పనులు నిలిపివేయాలనే ఆదేశాలు ఉన్నట్లయితే వాటిని లిఖితపూర్వకంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. లేదంటే వెంటనే ఉపాధి హామీ పనులను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కోరారు. ఉపాధి కూలీల జీవనాధారం అయిన పనులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా నిలిపివేయడం సమంజసం కాదని వారు మండిపడ్డారు.ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యపై స్పష్టత ఇవ్వాలన్నారు. లేకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి అంశాన్ని తీసుకెళ్లి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు.

# 'నేను సైతం'అంటూ చిన్నారి తనూజ

### పుట్టినరోజు సందర్భంగా సేవా దాతృత్వం

### ఇన్ఫినిటీ ట్రస్ట్‌కు రూ.10,116 విరాళం అందజేత



**అనంతపురం / కళ్యాణదుర్గం సంక్షేమం, మే 27,(రిపబ్లిక్ న్యూస్):** సమాజ సేవ చేయాలనే సంకల్పం ఉంటే వయసుతో సంబంధం లేదని ఓ తొమ్మిదేళ్ల చిన్నారి నిరూపించింది. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలకు స్ఫూర్తిగా, తన 9వ జన్మదినాన్ని అర్థవంతంగా జరుపుకుంటూ "నేను సైతం" అంటూ తన వంతు సహాయంగా రూ.10,116లను విరాళంగా అందించి అందరి ప్రశంసలు అందుకుంది.ఉపాధ్యాయ దంపతులు లక్ష్మన్న, చిట్టిల గారాల పట్టి తనూజ చిన్న వయసులోనే సేవాభావాన్ని చాటుకుంది. సాధారణంగా పుట్టినరోజు వేడుకలు, బహుమతులు, ఆటబొమ్మలపై ఆసక్తి చూపే పిల్లల మధ్య తనూజ మాత్రం భిన్నంగా ఆలోచించింది. సమాజానికి సేవ చేస్తున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ కార్యక్రమాల పట్ల ఆకర్షితురాలైన చిన్నారి .. తన పొదుపు మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలని నిర్ణయించుకుంది.హుండీలో దాచిన పొదుపే సేవా నిధి తన కిడ్డీ బ్యాంక్ (హుండీ)లో ఎంతో ఇష్టంగా దాచుకున్న రూ.7,010తో పాటు మొత్తం రూ.10,116లను ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్‌కు స్వయంగా అందజేసింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ మాట్లాడుతూ చిన్నారుల్లో సేవాభావం పెంపొందించడం సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. తనూజలాంటి పిల్లలు భవిష్యత్తుకు ఆదర్శమని కొనియాడారు. ఇలాంటి చిన్నారుల ప్రోత్సాహమే తమ సేవా కార్యక్రమాలకు మరింత బలం ఇస్తుందని పేర్కొన్నారు.కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు లక్ష్మన్న, చిట్టిలు కూతురికి చిన్నప్పటి నుంచే పొదుపు విలువ, సేవా దృక్పథం నేర్పించారు. ఈ సందర్భంగా చిన్నారి తనూజను పలువురు స్థానికులు, ట్రస్ట్ సభ్యులు అభినందించారు. పిల్లల్లో మానవత్వం పెంపొందించేలా తల్లిదండ్రులు చూపిన మార్గదర్శకత్వం ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.

# దేవనకొండకు మినీ స్టేడియం కావాలి

### యువత భవిష్యత్తు కోసం క్రీడా మైదానం మంజూరు చేయాలని విజ్ఞప్తి

### :- తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాకర్ల శాంతి కుమార్



**దేవనకొండ, మే 27( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** దేవనకొండ మండల కేంద్రంలో ప్రభుత్వ క్రీడా మైదానం మరియు మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాకర్ల శాంతికుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ సెంట్రల్ కార్యాలయంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు ను మర్యాదపూర్వకంగా కలిసి దేవనకొండ మండల యువత ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా కాకర్ల శాంతికుమార్ మాట్లాడుతూ, దేవనకొండ మండల కేంద్రంలో ఇప్పటివరకు ప్రభుత్వ క్రీడా మైదానం లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంత యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మండల జనాభాలో 40 శాతానికి పైగా యువత ఉన్నప్పటికీ, సరైన క్రీడా వసతులు లేక ప్రతిభావంతులైన క్రీడాకారులు అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.యువతను చెడు వ్యసనాల నుండి దూరం చేసి క్రీడల వైపు ప్రోత్సహించేందుకు, అలాగే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు దేవనకొండ మండల కేంద్రంలో సమీకృత క్రీడా ప్రాంగణం లేదా మినీ స్టేడియం ఏర్పాటు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు.ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దేవనకొండ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని మండల యువత తరఫున కోరారు.

# మహానాడులో టీడీపీ శ్రేణుల సందడి

### మహిళలకు 33 శాతం సీట్ల తీర్మానం చారిత్రాత్మకం -ముంటిమడుగు కేశవరెడ్డి



**ఆదోని ప్రతినిధి, మే 27,(రిపబ్లిక్ న్యూస్):** ఆదోని మహానాడులో టిడిపి శ్రేణులు సందడి చేశారు.ఈ సందర్భంగా వివిధ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన డిజిటల్ మహానాడు కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీ శ్రేణుల ఉత్సాహంతో ఘనంగా సాగాయి. స్థానిక ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆదోని నియోజకవర్గ పరిశీలకుడు, ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు పార్టీపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ముందుగా పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మహానాడు కార్యక్రమాలను ప్రారంభించారు.అనంతరం ముఖ్యమంత్రి, పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రసంగాలను డిజిటల్ స్క్రీన్‌ల ద్వారా వీక్షించారు. మహిళలకు 33 శాతం సీట్లు కల్పించాలని నారా లోకేష్ ప్రవేశపెట్టిన తీర్మానానికి కార్యకర్తలు హర్షధ్వానాలతో మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారతకు టీడీపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, మహిళలకు 33 శాతం రాజకీయ అవకాశాలు కల్పించే తీర్మానం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి స్వయంగా కార్యకర్తలకు భోజనాలు వడ్డించి ఆత్మీయత చాటుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేపట్టాలి

### - ఏవో పవన్ కుమార్



**బండి ఆత్మకూరు, మే 27, (రిపబ్లిక్ న్యూస్):-** ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అందుకు అనుగుణంగా రైతులు వ్యవసాయాన్ని మార్పు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని ఏ.కోడూరు గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు ఏకపంట విధానానికి స్వస్తి చెప్పి వైవిధ్య పంటలు పండించినట్లయితే నీటి సంరక్షణతో పాటు సుస్థిర దిగుబడులు సాధించవచ్చునని ఆయన వివరించారు. నవధాన్యాలు సాగులో భాగంగా పీఎండిఎస్ కిట్లతో 30 రకాల విత్తనాలు వేసి 40 రోజుల తర్వాత భూమిలో కలియ దున్నాలని వాటివల్ల అధిక పోషకాలు అందుతాయని వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు. ఏళ్ల తరబడి అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడడం వల్ల భూమిలో సహజ సారవంతం తగ్గిపోయి దిగుబడులపై ప్రతికూల ప్రభావాలు చూపుతున్నాయన్నారు. భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన మోతాదులోనే ఎరువులు వినియోగించడం వల్ల పెట్టుబడి తగ్గించుకొని దిగుబడిని పెంచుకోవచ్చన్నారు. అలాగే సల్ఫర్ అధికంగా ఉన్న ఎరువులను ఎక్కువగా వేయరాదన్నారు వీటివల్ల కుళ్ళు తెగులు ఆశించే ప్రమాదం ఎక్కువగా ఉందని ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది శ్రీనివాసరెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్డులు నిర్మించుకోవాలి...

### ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు ప్రతినిధి, మే 27(రిపబ్లిక్ న్యూస్)** ఆరోగ్యకరమైన మరియు సురక్షితమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకొని, వాటినే క్రమం తప్పకుండా వినియోగించుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు.. పంచలింగాల గ్రామంలో టీజీవి గ్రూప్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీ.ఎస్.ఆర్) నిధులు రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ఆయన ప్రారంభించారు..ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన వల్ల నీరు, గాలి కలుషితమై అనేక ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని తెలిపారు...ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, సచివాలయం ఉద్యోగులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అదనపు ఎస్పీగా వి.శ్రీనివాసరావుకు పదోన్నతి

### జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ



**అనంతపురం క్రైమ్, మే 27,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం అర్బన్ డీఎస్పీగా సేవలందిస్తున్న వి.శ్రీనివాసరావు అదనపు ఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన స్థానిక రేంజ్ కార్యాలయంలో ఐజీపీ డాక్టర్ షెముషి ఐపీఎస్‌ను, అనంతరం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్‌ను వారి క్యాంపు కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు ఆయనకు అభినందనలు తెలుపుతూ, నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

**సుదీర్ఘ సేవలకు గుర్తింపుగా పదోన్నతి**

గుంటూరు జిల్లా స్వస్థలమైన వి.శ్రీనివాసరావు 1989 జనవరి 16న సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీస్ శాఖలో అడుగుపెట్టారు. తన క్రమశిక్షణ, నిబద్ధతతో సీఐగా, అనంతరం డీఎస్పీగా పదోన్నతులు పొందుతూ రాష్ట్రంలోని పలు కీలక ప్రాంతాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు.గత ఏడాది సెప్టెంబర్ 24న అనంతపురం అర్బన్ డీఎస్పీగా బదిలీపై వచ్చిన ఆయన నగర శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం అదనపు ఎస్పీగా పదోన్నతి పొందడం పట్ల జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# అట్టహాసంగా టీడీపీ తొలిరోజు మహానాడు

### క్లస్టర్ ఇన్చార్జిల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ -తరలివచ్చిన టిడిపి శ్రేణులు

### వర్చువల్ విధానంలో నిర్వహణ, కార్యక్రమం వీక్షించిన తెలుగు తమ్ముళ్ళు



పార్నపల్లిలో టిడిపి జెండా ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకుల దృశ్యం



**బండి ఆత్మకూరు, మే 27, (రిపబ్లిక్ న్యూస్):-** తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం తొలి రోజు బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. బండి ఆత్మకూరు మండలంలోని 9, 10 క్లస్టర్ ఇంచార్జీలు బొల్లవరం మల్లేశ్వర రెడ్డి, కంచర్ల చిన్న లింగారెడ్డిల ఆధ్వర్యంలో మహానాడు కార్యక్రమం హైబ్రిడ్ విధానంలో జరిగింది. స్థానిక లక్ష్మీ జనార్ధన స్వామి ఆలయ ఆవరణలో ఉన్న కళ్యాణ మండపంలో పదో క్లస్టర్ ఇంచార్జి మహానాడు నిర్వహించగా పార్నపల్లె టిటిడి కళ్యాణ మండపంలో 9వ క్లస్టర్ ఇన్చార్జి మహానాడు నిర్వహించారు. ముందుగా మండలంలోని టిడిపి ముఖ్య నాయకులు సీనియర్ నాయకులు కార్యక్రమంలో పాల్గొని స్థానిక బస్టాండ్ ఆవరణలోని దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమాన్ని వాల్ స్క్రీన్ ల ద్వారా వీక్షించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, పొలిట్ బ్యూరోసభ్యులు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే పార్టీ వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామారావు తీసుకువచ్చిన సంస్కరణల గురించి వారు చర్చించారు. మహిళా శక్తిలో భాగంగా టీడీపీ పార్టీ మహిళలకు ప్రాధాన్యతను వివరించారు. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆసక్తిగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ఇన్చార్జి ముమ్మడి నాగ కృష్ణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నందిపాటి నరసింహారెడ్డి, కంచర్ల సురేష్ రెడ్డి, మనోహర్ చౌదరి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ భరత్ శర్మ, బైరెడ్డి సుబ్బారెడ్డి, అన్నం శంకర్ రెడ్డి, దూదేకుల సిద్దయ్య, వెంకటాపురం శ్రీనివాసులు, మహేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రుడు, అల్లె చెన్నారెడ్డి, జాకీర్ ఖాన్, నర్ల నాగేశ్వర రెడ్డి,పార్నపల్లె మురళీధర్ రెడ్డి, బైరెడ్డి మధుసూదన్ రెడ్డి, వివిధ గ్రామాల తెలుగు తమ్ముళ్ళతో పాటు మహిళ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన మహానాడు వేడుకలు







**మహానంది, మే 27, (రిపబ్లిక్ న్యూస్):-** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మహానాడు వేడుకలు బుధవారం మహానందిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మహానంది మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కంచర్ల శివశంకర్ చౌదరి, క్లస్టర్ ఇంచార్జి నరాల మౌళీశ్వర రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి కేసి కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బన్నురు రామలింగారెడ్డి హాజరయ్యారు.మహానంది లోని కమ్మ సత్రంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలనుండి వందల సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు.అంతకుముందు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం బన్నురు రామలింగారెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వారికోసం ఏర్పడిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. గ్రామాల అభివృద్ధి అంటే తెలుగుదేశం పార్టీతోనే అని తెలిపారు. పేదవారికోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు,నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షులు శ్యామల జనార్దన్ రెడ్డి,మహానంది మండల మాజీ అధ్యక్షులు ఉల్లి మధు,యూనిట్ ఇంచార్జు భాష్యం రాముడు గౌడ్,ఖాజా హుస్సేన్,తెలుగుగంగ కాలువ డిస్ట్రిబ్యూటీ చైర్మన్ క్రాంతి కుమార్ యాదవ్, టీజీవి 9 వ బ్లాక్ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి ,మాజీ ఎంపీపీ నాగ భూపాల్ రెడ్డి, గంగిశెట్టి మల్లికార్జున రావు, పి.రాజా ,మహిళా నాయకురాలు ఉమాదేవి, శశికళ కొండారెడ్డి,గడ్డం నాగపుల్లయ్య చౌదరి, సతీష్ కుమార్ చౌదరి,తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా మొదటిరోజు వర్చువల్ మహానాడు





**రైల్వే కోడూరు మే 27 రిపబ్లిక్ న్యూస్.** రైల్వే కోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండల కేంద్రం కడప చెన్నై జాతీయ రహదారి అనుకొని ఉన్న శ్రీనివాస కళ్యాణ మండపంలో మొదటి రోజు వర్చువల్ మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి పాల్గొనడం జరిగినది తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వర్చువల్ మహానాడు కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి లోకేష్ బాబు ప్రసంగాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు,మహానాడు ముఖ్య ఉద్దేశం భవిష్యత్తు కార్యాచరణ ప్రజా సంక్షేమం దృష్ట్యా సూపర్ సిక్స్ సూపర్ పథకాలు గురించి మాట్లాడుతున్న ప్రసంగాలను స్థానిక క్లస్టర్ 8 నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రద్ధాసక్తులతో వినడం జరిగినది, కాకార్యక్రమానికి విచ్చేసిన ముక్కా రూపానంద రెడ్డి టిడిపి నేతలు కార్యకర్తలు గ్రామస్తులు బాణసంచా పేలుస్తూ పూల వర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు, క్లస్టర్ 8 ఇంచార్జ్ సుండు ఈశ్వర చంద్రప్రకాష్ పర్యవేక్షణలో ఈ వర్చువల్ పద్ధతిలో ఏర్పాటుచేసిన స్క్రీన్ నుండి టిడిపి కేంద్ర పార్టీ కార్యాలయం నుండి జరుగుతున్న కార్యక్రమాల ప్రసంగాలను వీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎంపీటీసీలు, జడ్పిటిసి సర్పంచులు బూత్ కమిటీ లీడర్లు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ముక్కా రూపానంద రెడ్డి చిట్వేలు మండలం చక్రం పేట నందు జరిగిన క్లస్టర్ 2 మహానాడు కార్యక్రమానికి హాజరు కాక నాయకులు కార్యకర్తలు తెలుగు తమ్ముళ్లు ప్రజలు అందరూ ఆయనకు పూలు చల్లుతూ స్వాగతం పలికారు నాయకులందరితో కలిసి మాట్లాడుతూ ఈ మహానాడు రాబోయే ఎన్నికలకు బూస్ట్ లాంటిదని అందరం కలిసి పార్టీ అభివృద్ధికి పాటుపడాలని అందరూ కలిసి పని చేయాలని ఈ సందర్భంగా వారికి సూచించారు కార్యక్రమంలో చిట్వేలి మండల ఎంపీటీసీలు సర్పంచులు జడ్పిటిసి స్థానిక లీడర్లు కార్యకర్తలు తెలుగు తమ్ముళ్లు అందరూ హాజరై ఘనంగా మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888



## ఘనంగా ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ మహానాడు వేడుకలు

**చౌడేపల్లి ప్రతినిధి మే 27 రిపబ్లిక్ న్యూస్**



మండల కేంద్రమైన చౌడేపల్లి లో తెలుగుదేశం పార్టీ మహానాడు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహానాడు కార్యనిర్వహణ ఇన్చార్జి మాదిరాజు లక్ష్మణ రాజు( పతి రాజు ) క్లస్టర్ ఇంచార్జి పవన్ కుమార్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు బస్టాండ్ నందు పార్టీ జెండాను ఆవిష్కరించి అమరజీవి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ నుంచి శ్రీ లక్ష్మీ శ్రీనివాస కళ్యాణ మండపం వరకు ర్యాలీగా వెళ్లారు ఇందులో భాగంగా బాణాసంచాలు పేర్చుతూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సభ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎల్ఈడి నందు ముఖ్యమంత్రి తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్ అదేవిధంగా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మరి కొంతమంది మంత్రులు నాయకులు ప్రసంగాన్ని అందరూ ఆలకించారు. తొలి రోజు పలు కీలక తీర్మానాలపై సుదీర్ఘంగా చర్చించారు ప్రతి తీర్మానానికి ముందు పార్టీ ప్రస్థానం ప్రభుత్వ ప్రగతిపై ప్రత్యేక వీడియోలు ప్రదర్శించారు మండలంలోని పలు ప్రాంతాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తరలివచ్చి మహానాడు వేడుకల్లో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ యువ నేత మాదిరాజు ప్రదీప్ రాజు, భోజనాల రెడ్డి ప్రసాద్,ఆవుల రామచంద్రయ్య, సింగిల్ విండో చైర్మన్ హరి రాయల్ , వేలూరు సుబ్రహ్మణ్యం,కార్తీక్, కిషోర్ సాగిరాజు, మహేష్ ,సాగర్ , రాజేష్, నాగభూషణాచారి, శివప్ప, మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్ని ప్రభుత్వాలు మారినా పేదల తలరాతలు మారలేదు

**రైల్వే కోడూరు మే 27 రిపబ్లిక్ న్యూస్.**



ఎన్ని ప్రభుత్వాలు మారిన ఎందరు నాయకులు మారిన పేదల తలరాతలు మారకపోవడం బాధాకరం వివరాల్లోకి వెళితే పెనగలూరు మండలం అనంతపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బంజరు భూమిలో చక్రం పేట ఎగువపల్లె దళితవాడకు సంబంధించిన కొందరు నిరుపేదలు ప్రభుత్వ భూమిలో గత 30 సంవత్సరాలకు పైబడి గుడిసెలు వేసుకొని మేకలు గొర్రెలు పశువులు మేపుకొని అక్కడ నివసిస్తుంటే చదర పంచాయతీ రాజుపాలెం కు చెందిన కొందరు అగ్రకులాలవారు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారిని తరిమేసి ఆ భూమిని ఆక్రమించుకొని చదును చేసుకున్నారు ఇదేమి అన్యాయం అని అడిగితే ఇది మాకు సంబంధించినది ఇక్కడ మేము దేవాలయం నిర్మించుకోవాలి మీరు వెళ్లిపోండి అని వారిని గద్దించినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు, అర్థం కాని స్థితిలో వారు రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున, భారతీయ బహుజన సంఘ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కెవల్ నారాయణ, అంబేద్కర్ సేవా సమితి ఉపాధ్యక్షుడు ముత్యాల గాజుల శ్రీను దృష్టికి తీసుకెళ్లగావారు స్పందించి బుధవారం వివాదాస్పద భూస్థలానికి చేరుకొని ప్రభుత్వ బంజరు భూమిని పరిశీలించి, అనంతరం విషయాన్ని పెనగలూరు మండల తాసిల్దారు శిరీష దృష్టికి తీసుకెళ్లడం జరిగినది ఆమె స్పందించి సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడం జరుగుతోందని పేదలకు న్యాయం జరిగేలా చేస్తామని ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర నాయకులకు హామీ ఇచ్చినట్లు వారు తెలియజేశారు అనంతరం వారు స్థానికులతో మాట్లాడుతూ గ్రామంలో భూమి, ఇల్లు, లేని నిరుపేదలకు ప్రభుత్వ బంజరు భూమి చెందేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా పోరాటం చేస్తామన్నారు ,ఆ బంజరు భూమిలో స్థానిక ఎగువ పల్లె దళితవాడకు చెందిన పేదలకున్యాయం చేయని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పేదలైన దళితుల తో కలిసి ధర్నాకు దిగుతామని వారు సందర్భంగా రెవెన్యూ వారికి తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక దళితులు,అంబేద్కర్ సేవా సమితి, భారతీయ బహుజన సంఘ నాయకులు పాల్గొనడం జరిగినది.

## రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పార్టీగా బీసీవై

**చౌడేపల్లి ప్రతినిధి మే 27 రిపబ్లిక్ న్యూస్**



రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పార్టీగా బీసీవై పార్టీ ఆవిర్భవిస్తుందని ఆ పార్టీ నాయకులు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు కొందరు తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు చేస్తున్న వ్యాఖ్యలకు బుధవారం సత్య బండకు చేరుకున్నారు రామచంద్ర యాదవ్ పై కొందరు రాజకీయ ప్రత్యర్థులు చేస్తున్న తప్పుడు ఆరోపణలకు సమాధానంగా, పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మండలం రాజనాల బండలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పాదాల చెంత వెలసిన ప్రసిద్ధ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో బీసీవై పార్టీ నాయకులు సత్య ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా బీసీవై పార్టీ నాయకులు మాట్లాడుతూ"మా పార్టీ జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ కానీ, పార్టీ నాయకులు కానీ ఎలాంటి ఇతర రాజకీయ పార్టీలకు తొత్తులు కాదని, బినామీలు కాదని దేవుని సాక్షిగా ప్రమాణం చేశాము. రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారాలు చేయడం ప్రజలను తప్పుదారి పట్టించే చర్య" అని పేర్కొన్నారు. అలాగే బీసీవై పార్టీకి సవాలు విసిరిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆలయానికి వచ్చి ప్రమాణం చేయకపోవడం ప్రజలు గమనించారని విమర్శించారు. ఈ రాష్ట్రంలో టిడిపి, వైసిపి పార్టీలు పరస్పరం రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని ప్రజలకు స్పష్టంగా తెలుసునని అన్నారు. బీసీల హక్కులు, యువత భవిష్యత్తు, సామాన్య ప్రజల సమస్యలపై రాజీపడకుండా పోరాడేది బీసీవై పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ పీఏసీ కమిటీ సభ్యులు పాల రమేష్ యాదవ్, పూల ప్రేమ్ కుమార్ (బీసీవై యూత్ కో-కన్వీనర్), పుంగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ హరిబాబు యాదవ్, సురేష్ యాదవ్, కుమ్మర గిరిబాబు, శివకుమార్, వెంకటేష్ యాదవ్, చలపతి, రెడ్డివారి మోహన్, స్వాతి ప్రసాద్,తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏడుపాయల వన దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకున్న మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ దంపతులు

**మెదక్ జిల్లా ప్రతినిధి మే 27 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**





మెదక్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వన దుర్గా భవాని దేవస్థానాన్ని మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ గారు తమ సతీమణితో కలిసి దర్శించుకున్నారు.
ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా డా. మైనంపల్లి రోహిత్ గారు మాట్లాడుతూ, "ఏడుపాయల అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. దేవస్థాన అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తాం" అని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మరియు మండల అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్స్ దేవస్థాన కార్యనిర్వహణాధికారి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలికి పాముకాటు





**కోవెలకుంట్ల మే 27 రిపబ్లిక్ న్యూస్**

నంద్యాల జిల్లా కోవెలకుంటలో ఉపాధి హామీ పనులు చేస్తున్న మహిళా కూలి శిరీష పాముకాటుకు గురైన ఘటన కలకలం రేపింది. ఎస్ఆర్బిసి కాలువ సమీపంలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. శిరీషను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యులు పరీక్షించి ప్రస్తుతం ఎటువంటి ప్రాణాపాయం లేదని వెల్లడించడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు చేసే సమయంలో కూలీలు తగిన జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా పొదలు, గడ్డి ప్రాంతాల్లో పనిచేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.

## చివరి గింజ వరకూ కొనుగోలు చేయాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్ జిల్లా ప్రతినిధి మే 27 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

బుధవారం మెదక్ మండలంలోని రాయలపూర్, కౌడిపల్లి మండలం కుల్చారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే బాయిల్డ్ మిల్లులకు తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు.సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓర్వకల్లు మండల కేంద్రంలో లో వైభవంగా మహానాడు

**తెలుగుదేశం కార్యకర్తలే బలం బలగం**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి**

**ఓర్వకల్లు టిడిపిమండల కన్వీనర్ నాగిరెడ్డి**



**ఓర్వకల్లు ప్రతినిధి, మే 27(రిపబ్లిక్ న్యూస్)**

పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండల కేంద్రంలో బుధవారం రోజున స్థానిక తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ఓర్వకల్లు మండల గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున రావడం జరిగింది మహానాడు వైభవంగా జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాణ్యం నియోజకవర్గం టిడిపి యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు, ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, అనంతరం నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయము ను ప్రారంభించారు, తెలుగుదేశం యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగం, అని ఈ మహానాడు పండుగకు వచ్చిన ప్రతీ కార్యకర్తలకు కృతజ్ఞతల ని తెలిపారు, ఈ కార్యక్రమం ఓర్వకల్లు మండల కన్వీనర్ నాగిరెడ్డి మండల టిడిపి నాయకులు అందరూ కలిసి విజయవంతంగా జరిగినందుకు కృతజ్ఞతలు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లోకేష్ పిలుపు మేరకే ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించామని, నందమూరి తారక రామారావు పార్టీ బడుగు, బలహీన, వర్గాల మహిళాభివృద్ధి కోసమే తెలుగుదేశం పార్టీ స్థాపించారని పేదల కోసమే అహర్నిశలు కష్టపడ్డారని, తెలుగుజాతి ఆత్మగౌరవం కాపాడాలని, సమాజమే దేవాలయం ప్రజలే నా దేవుళ్ళని నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించడం జరిగిందని, నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా చంద్రబాబు నాయుడు నారా లోకేష్ ఆయన అడుగుజాడల్లో పార్టీని అంచలు అంచలుగా ముందుకు తీసుకెళ్తున్నా రని, మా పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని, అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు, స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల గ్రామాల టిడిపి ముఖ్య నాయకులకు శాలువాలు కప్పి సత్కరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మరియు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మహానాడుతో టీడీపీలో నూతన ఉత్సాహం

**దేవనకొండ మండలంలో ఘనంగా నిర్వహించిన మహానాడు కార్యక్రమం**

**దేవనకొండ నుంచి భారీగా తరలిన కార్యకర్తలు పాల్గొన్న వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ**





**దేవనకొండ, మే 27( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మహానాడు కార్యక్రమం దేవనకొండ మండలంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పాల్గొన్నారు. దేవనకొండ మండలం నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై పార్టీపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. మహానాడు ప్రాంగణం మొత్తం పార్టీ జెండాలు, నినాదాలతో సందడిగా మారింది. కార్యకర్తల్లో ఉత్సాహం స్పష్టంగా కనిపించింది. పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ అంశాలపై నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా బొజ్జమ్మ మాట్లాడుతూ మహానాడు టీడీపీకి దిశానిర్దేశం చేసే వేదిక అని పేర్కొన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆశయాలను ప్రతి కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే టీడీపీ ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి పార్టీ కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహానాడులో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ రాజకీయాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. పార్టీ అధినేతల ప్రసంగాలు కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని నాయకులు పేర్కొన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి కార్యకర్త సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. దేవనకొండ మండలం నుంచి మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహానాడు ద్వారా పార్టీ శ్రేణుల్లో మరింత ఐక్యత పెరిగిందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. ప్రజలకు మరింత చేరువై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మహానాడు విజయవంతం కావడంతో టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. దేవనకొండ ప్రాంతంలో పార్టీ మరింత బలపడుతుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోని టిడిపి నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు,మాజీ ఎంపీటీసిలు, కార్యకర్తలు, అభిమానులు, క్లస్టర్ ఇంచార్జిలు,కో క్లస్టర్ లు, యూనిట్ ఇంచార్జిలు, యూనిట్ కో క్లస్టర్లు, బూతు ఇంచార్జిలు,కో ఇంచార్జిలు,పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ మహానాడు ప్రోగ్రాంను విజయవంతం చేయడం జరిగిందని తెలియజేశారు

## అనంతలో గంజాయి గ్యాంగ్ గుట్టురట్టు

**14 మంది అరెస్ట్ .. 7 కిలోల గంజాయి స్వాధీనం**






**అనంతపురం క్రైమ్, మే 27,( రిపబ్లిక్ న్యూస్):**

అనంతపురం నగరంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. వినూత్నంగా వినియోగించిన గంజాయి టెస్టింగ్ కిట్లు చివరకు భారీ గంజాయి ముఠాను గుట్టురట్టు చేశారు. ఈ సందర్భంగా మొత్తం 7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు 14 మంది సభ్యుల ముఠాను అరెస్ట్ చేశారు. వీరిలో కింగ్‌పిన్ సహా ఐదుగురు పాత నేరస్తులు ఉండటం కలకలం రేపింది. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నగరంలో గంజాయి నిర్మూలనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అనుమానితులపై గంజాయి టెస్టింగ్ కిట్లతో పరీక్షలు నిర్వహించగా పలువురికి పాజిటివ్ వచ్చింది. దీంతో వారిపై ప్రత్యేక నిఘా పెట్టి లోతుగా విచారణ చేపట్టగా గంజాయి సరఫరా ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు.

**పాకెట్లుగా తయారు చేయించి యువతకు విక్రయం**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నగరంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన షికారి సురేష్ ఈ ముఠాకు కీలక సూత్రధారిగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగా గుంతకల్లు రైల్వే స్టేషన్ కేంద్రంగా గంజాయి నెట్‌వర్క్ నడుపుతూ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి తక్కువ ధరకే గంజాయి కొనుగోలు చేసి అనంతరం తన అనుచరుల సహకారంతో అనంతపురానికి తరలించి చిన్న చిన్న పాకెట్లుగా తయారు చేయించి యువత, వ్యసనపరులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. అరెస్టైన వారిలో షికారి సురేష్‌తో పాటు షికారి మల్లప్ప, భరత్, పరశురాం, రవి పాత నేరస్తులుగా పోలీసులు గుర్తించారనీ, వీరిపై దొంగతనాలు, ఎక్సైజ్, ఎన్‌డీపీఎస్ కేసులు ఇప్పటికే నమోదై ఉన్నాయన్నారు. మిగతా తొమ్మిది మంది స్థానికంగా గంజాయి పాకెట్లు విక్రయిస్తున్నట్లు తేలిందనీఈ వ్యవహారంలో పోలీసులు కేవలం సరఫరాదారులనే కాకుండా గంజాయి సేవిస్తున్న యువకులను కూడా గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చే చర్యలు చేపట్టారన్నారు. అయితేమత్తు పదార్థాలకు బానిసైన వారిని పరివర్తన దిశగా నడిపించే ప్రయత్నాలు అధికారులు చేస్తున్నారనీతెలిపారు. అనంతపురం అర్బన్ ఎస్డీపీవో వి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో వన్‌టౌన్, టూ టౌన్, త్రీటౌన్, సీసీఎస్ పోలీస్ బృందాలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారన్నారు. అయితే "యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తప్పవనీ, ఎంతటి వారైనా ఉపేక్షించం " అని జిల్లా ఎస్పీ జగదీష్ హెచ్చరించారు.

# రూ.1.67 కోట్ల పనులకు శ్రీకారం

### కర్నూలు అభివృద్ధికి వేగం పెంచిన మంత్రి టీజీ భరత్



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 27)** కర్నూలు నగరాన్ని ఆధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేసి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ భరత్ తెలిపారు. నగరంలోని పలు వార్డుల్లో రూ.1.67 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఒబులేసు తో కలిసి మంత్రి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.9, 10, 11, 12, 13 వార్డుల్లో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ కాలువల మరమ్మతులు, 600 ఎంఎం సీసీ డ్రైనేజీ కాలువ నిర్మాణం, కమ్యూనిటీ టాయిలెట్ల మరమ్మతులు, ఫిషరీస్ కంపౌండ్ సమీపంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.అదేవిధంగా 1, 2, 6 వార్డుల్లో రూ.27.49 లక్షలతో సీసీ డ్రైనేజీ కాలువల మరమ్మతులు, కల్వర్టుల పునరుద్ధరణ, సీసీ రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. 18వ వార్డులో రూ.49.98 లక్షలతో సీసీ రోడ్డు విస్తరణ, 750 ఎంఎం సీసీ డ్రైనేజీ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 14, 15, 16, 17 వార్డుల్లో రూ.39.84 లక్షలతో బోర్‌వెల్లు, హెచ్‌డిపిఈ పైప్‌లైన్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు.ఇటీవల గాలివాన తర్వాత మున్సిపల్, విద్యుత్ శాఖల సిబ్బంది సమన్వయంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టారని అభినందించారు. నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలన అందిస్తోందన్నారు. ఎన్నికల హామీ మేరకు కర్నూలును వైజాగ్ తరహాలో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని, ప్రస్తుతం ప్రారంభించిన పనులను మూడు వారాల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

# మాధవరం హౌసింగ్ లే ఔట్‌లో రోడ్డు నిర్మాణానికి చర్యలు

### ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశం





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 27)** జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశించారు. మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలోని హౌసింగ్ లే ఔట్‌ను పరిశీలించిన కలెక్టర్, అక్కడి లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.లబ్ధిదారులు సుగుణ, ఈరన్న, జమ్మయ్య తదితరులతో మాట్లాడిన కలెక్టర్, కాలనీలో విద్యుత్, తాగునీటి సదుపాయాలు ఉన్నప్పటికీ రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.హౌసింగ్ లే ఔట్‌లలో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి అయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు.అలాగే నిర్మాణ దశలకు అనుగుణంగా బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలని, అవసరమైన చోట రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటి నిర్మాణ పురోగతిని దశలవారీగా పరిశీలిస్తూ లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చిరంజీవి, డ్వామా పీడీ నరసింహారెడ్డి, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, మంత్రాలయం తహసీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# జనగణన, ఎస్ఐఆర్ ప్రక్రియలను వేగవంతం చేయాలి

### లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం సహించం -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, మే 27( రిపబ్లిక్ న్యూస్):**
ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాలైన జనగణన మరియు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్‌డీఓలు, ఎంపీడీఓలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో జనగణన పురోగతి 89.95 శాతానికి చేరుకున్నప్పటికీ, ఫీల్డ్ స్థాయిలో అధికారులు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 2011 జనాభాతో పోల్చితే తక్కువ నమోదు ఉన్న గ్రామాలు, లాక్డ్ హౌసులు, ఖాళీ ఇళు ్ల, సంస్థల వివరాల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గురువారం సెలవు దినమైనప్పటికీ పెండింగ్‌లో ఉన్న ప్రక్రియలను పూర్తి చేసి హెచ్‌ఎల్‌పీ క్లోజర్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో జిల్లాకు ప్రస్తుతం 68 శాతం పురోగతి నమోదైందని, గురువారం సాయంత్రంలోగా 71 శాతం దాటేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బీఎల్ఓ యాప్‌పై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఫీల్డ్‌లో ప్రత్యక్షంగా పర్యటిస్తూ సిబ్బందికి మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యుల వివరాల మ్యాపింగ్‌లో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.జనగణనలో 92 శాతం, ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో 71 శాతం పురోగతి సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం అధికారులు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పగల స్థాయిలో అంశాలపై పూర్తి అవగాహన మరియు పట్టు సాధించాలని సూచించారు

# ప్రకృతి వ్యవసాయ విస్తరణకు రైతులు ముందుకు రావాలి

### : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

### భూమిని 365 రోజులు సజీవంగా ఉంచే పీఎండీఎస్ విధానంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

### రసాయన ఎరువుల వినియోగం తగ్గించి భూసారం పరిరక్షించాలి : రైతులకు కలెక్టర్ పిలుపు







**నంద్యాల బ్యూరో, మే 27 (రిపబ్లిక్ న్యూస్):**
రసాయన ఎరువుల అధిక వినియోగంతో భూసారం క్షీణిస్తున్న నేపథ్యంలో రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ఆచరించి భూమి ఆరోగ్యాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. బుధవారం దొర్నిపాడు మండలం గుండుపాపల గ్రామంలో ఏపీసీఎన్ఎఫ్/రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక "షణ్ముఖ గోఆధారిత ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ను సందర్శించిన కలెక్టర్, ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన జీవామృతాలు, కషాయాలు, బయో ఇన్‌పుట్స్ తయారీ విధానాలను పరిశీలించి నిర్వాహకుడు మహేశ్వర్ రెడ్డిని అభినందించారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 48,500 హెక్టార్లలో 85 వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, మొత్తం 3.5 లక్షల మంది రైతుల్లో మరింత మంది ఈ విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్యరంగాల ద్వారా జిల్లా జీడీపీలో సుమారు 42 శాతం ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూమి నిస్సారమవుతోందని ఆందోళన వ్యక్తం చేసిన కలెక్టర్, ముఖ్యంగా డీఏపీ వినియోగంలో నంద్యాల జిల్లా దేశంలోనే అగ్రస్థానంలో ఉండటం ఆందోళనకరమన్నారు. పంట మార్పిడి విధానాన్ని పాటించకపోవడం, ఒకే రకమైన పంటల సాగు, ఖరీఫ్ అనంతరం భూములను ఖాళీగా ఉంచడం వంటి కారణాల వల్ల కూడా భూసారం దెబ్బతింటోందన్నారు. పీఎండీఎస్ విధానం ద్వారా భూమిని 365 రోజులు పచ్చదనంతో కప్పి ఉంచడంతో పాటు నేలలో సూక్ష్మజీవుల పెరుగుదల, తేమ నిల్వ సామర్థ్యం మెరుగుపడుతాయని కలెక్టర్ వివరించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే ప్రభుత్వం 34 రకాల విత్తనాలతో కూడిన పీఎండీఎస్ కిట్లను అందిస్తున్నదని తెలిపారు. ఈ కిట్లలో ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, పశువులకు ఉపయోగపడే పచ్చిమేత విత్తనాలు ఉన్నాయని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం రోజుకు సుమారు 11 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోందని, పీఎండీఎస్ ద్వారా పచ్చిమేత లభ్యత పెరిగితే దీనిని 16 నుంచి 17 లక్షల లీటర్ల వరకు పెంచే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అనంతరం రైతులకు పీఎండీఎస్ కిట్లను పంపిణీ చేసిన కలెక్టర్, ముక్కామల అపర్ణమ్మకు చెందిన పొలంలో నిర్వహించిన విత్తన గుళికల (సీడ్ పెల్లెటైజేషన్) తయారీ ప్రదర్శనను పరిశీలించారు. జీవామృతం, ఘన జీవామృతంతో విత్తనాలను శుద్ధి చేసి గుళికల రూపంలో తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ పద్ధతి ద్వారా విత్తనాల మొలక శాతం పెరగడంతో పాటు ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. తదుపరి అదే పొలంలో పీఎండీఎస్ విత్తనాల వెదజల్లే కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పెద్దఎత్తున ప్రకృతి వ్యవసాయం, పీఎండీఎస్ విధానాలను అమలు చేసి భూమిని సజీవంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వ్యవసాయ సంచాలకులు గంగాధర్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, వ్యవసాయ మరియు ఉద్యాన శాఖ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎఫ్ఎమ్‌టిలు, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

# మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి

### ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు విలువ ఆధారిత ప్రాసెసింగ్‌కు ప్రోత్సాహం

### రైతు సమూహాలకు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు





**నంద్యాల బ్యూరో, మే 27 (రిపబ్లిక్ న్యూస్):**
నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం ఉమాపతి నగరానికి చెందిన రైతు గడ్డిపాటి రాజశేఖర్ ఆధ్వర్యంలో "సృష్టి రైతు సమూహం" ద్వారా ఏర్పాటు చేసిన మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సందర్శించి అక్కడ జరుగుతున్న ప్రాసెసింగ్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి రాజశేఖర్ కలెక్టర్‌కు వివరాలు తెలియజేస్తూ, రైతులకు విత్తనాలు అందజేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన మిల్లెట్స్‌ను తిరిగి కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేస్తున్నట్లు తెలిపారు. కొర్రలు, సామలు, ఊదలు, అరికెలు, అండుకొర్రలు, వరిగలు వంటి చిరుధాన్యాలను బియ్యంగా మార్చడంతో పాటు సజ్జలు, రాగులు, జొన్నలను శుభ్రపరిచి ప్యాకింగ్ చేసి వినియోగదారులకు అందిస్తున్నట్లు కలెక్టర్ కు నివేదించారు. రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. యూనిట్‌ను సందర్శించిన కలెక్టర్ రాజకుమారి స్వయంగా మిషన్ ప్రారంభించి ముడి సరుకు నుంచి బియ్యం, నూకలు ఎలా తయారవుతున్నాయో ప్రాసెస్‌ను పరిశీలించారు. అక్కడ తయారు చేసిన మిల్లెట్ స్నాక్స్‌ను రుచి చూసి వాటి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు రవ్వ తయారీ మిషన్ మరియు సార్టెక్స్ మిషన్ కొనుగోలుకు ఆర్థిక సహాయం లేదా సబ్సిడీ మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్, రూ.50 లక్షల వరకు ప్రాజెక్టులకు అవకాశాలు ఉన్నాయని, సంబంధిత వివరాలను సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధించి యూనిట్ జీఎస్టీ, ఫుడ్ లైసెన్స్, ఉద్యమ్ ఆధార్, అవసరమైన యంత్రాల అంచనా వ్యయ వివరాలతో కూడిన దరఖాస్తును సమర్పించాలని కలెక్టర్ సూచించారు. మిషనరీ కొనుగోలుకు సుమారు రూ.26 లక్షలు అవసరమవుతాయని, ప్రస్తుతం ముడి సరుకు కొనుగోలుకు వర్కింగ్ క్యాపిటల్ కొరత ప్రధాన సమస్యగా ఉందని సంఘ ప్రతినిధి సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులకు విలువ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్లు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. రైతు సమూహాల అభివృద్ధికి ప్రభుత్వం అందించే అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.

# ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

### ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలన

### ఓటరు మ్యాపింగ్‌లో ఖచ్చితత్వం పాటించాలని అధికారులకు ఆదేశాలు

### స్వచ్ఛమైన ఓటరు జాబితాలే ప్రజాస్వామ్యానికి బలం : కలెక్టర్





**నంద్యాల బ్యూరో, మే 27 (రిపబ్లిక్ న్యూస్):**
స్వచ్ఛమైన, నిర్దిష్టమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. బుధవారం దొర్నిపాడు మండలం గుండుపాపల గ్రామ సచివాలయ పరిధిలోని ఉమాపతినగర్‌లో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను తనిఖీ చేసి, నమోదు ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మెట్టుపల్లి లక్ష్మి అనే మహిళ పేరు ప్రస్తుత ఓటర్ల జాబితాలో ఉండగా, 2022 జాబితాలో లేకపోవడం గమనించిన కలెక్టర్, సంబంధిత వివరాలను ఆరా తీశారు. ఆమెకు సంబంధించిన సెల్ఫ్ డిక్లరేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని సూచించగా, అధికారులు అక్కడికక్కడే పూర్తి చేశారు. అలాగే, ఆమె పుట్టినిల్లు బనగానపల్లె మండలం వెంకటాపురం గ్రామమని తెలుసుకున్న కలెక్టర్, అక్కడి పోలింగ్ స్టేషన్ నంబర్-169లో ఉన్న ఓటరు వివరాలను పరిశీలించి, కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గుండు పాపుల సచివాలయాన్ని సందర్శించిన కలెక్టర్, సిబ్బందితో సమావేశమై ఓటరు మ్యాపింగ్, ఫీల్డ్ స్థాయి సర్వే విధానం, సెన్సస్ ప్రక్రియ అమలు తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పరిధిలో సెన్సస్ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో సిబ్బంది పనితీరు, ఇంటింటి ధృవీకరణ విధానం, ఓటరు మ్యాపింగ్ ఖచ్చితత్వంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, తప్పులులేని ఓటర్ల జాబితా తయారు చేయాలని సూచించారు. అలాగే, ఎన్నికల ప్రక్రియలో వినియోగిస్తున్న పీఎంయూ యాప్ పనితీరు, డేటా నమోదు విధానం, సాంకేతిక సమస్యలపై కూడా సిబ్బందిని అడిగి తెలుసుకుని తగిన సూచనలు చేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com